JANA SAINYAM

# జనసైన్యం

ప్రజల పక్షం జనసైన్యం

తెలుగు దినపత్రిక



కరీంనగర్ జిల్లా. సంపుటి 3. సంచిక 298 17 బుధవారం జూన్ 2026 ఎడిటర్ గుంటపల్లిస్వామి https://epaper.janasainyam.in పేజీలు: 12 రూ.5

## పుస్తకాలను అమ్మి వ్యాపారం చేస్తున్న

# శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

జనసైన్యం సిటి

కార్పొరేట్ విద్యాసంస్థ అయిన శ్రీ చైతన్య పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న పుస్తకాల వ్యాపారాన్ని అరికట్టాలని, ఆ సంస్థ గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శ్రీ చైతన్య యాజమాన్యం ఒక ప్రైవేట్ గదిని అద్దెకు తీసుకుని, తమ ఇష్టానుసారంగా పుస్తకాలు అమ్ముతున్న స్థావరం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆ పుస్తకాలను జిల్లా విద్యాశాఖాధికారి (డిఈవో) కార్యాలయానికి తరలించి అక్కడ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ.. కరీంనగర్ పట్టణంలో శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ పుస్తకాల వ్యాపారానికి తెరలేపిందని మండిపడ్డారు. ఒక్కో పదో తరగతి విద్యార్థి నుంచి పుస్తకాల కోసమే రూ. 16,000 వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ పాఠశాల కూడా క్యాంపస్‌లో గానీ, బయట ప్రైవేట్ గదుల్లో గానీ పుస్తకాలు, దుస్తులు అమ్మకూడదనే స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని గుర్తుచేశారు. కేవలం సిలబస్ పుస్తకాల జాబితాను మాత్రమే నోటీస్




బోర్డుపై పెట్టాలని, కానీ శ్రీ చైతన్య యాజమాన్యం హైకోర్టు ఉత్తర్వులను, విద్యాశాఖ జీవోలను పూర్తిగా బేఖాతరు చేస్తోందని విమర్శించారు.ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎస్సీఈఆర్టీ (ఎస్సిఈఆర్టి) పుస్తకాలను పక్కనబెట్టి, భారీగా కమిషన్లు ఇచ్చే ప్రైవేట్ పబ్లిషర్స్ పుస్తకాలను విద్యార్థులపై బలవంతంగా రుద్దుతున్నారని ఆరోపించారు. ఈ అక్రమ దందా వెనుక విద్యాశాఖ అధికారుల మామూళ్ల సిత్రం కూడా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితమవుతున్నారని, అక్రమ పుస్తకాలను డీఈఓ ఆఫీసుకు తీసుకువచ్చినా కనీసం వాటిని సీజ్ చేయలేని దుస్థితిలో ఉన్నారని విమర్శించారు.మండల విద్యాశాఖాధికారులు (ఎమ్ఈవో) నిరంతరం కార్పొరేట్ విద్యాసంస్థలపై పర్యవేక్షణ చేయాలని కోరారు. అక్రమంగా పుస్తకాలు అమ్ముతున్నట్లు సమాచారం ఇచ్చినా అధికారులు రెస్పాండ్ కాకపోవడం దారుణమన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, అక్రమ పుస్తకాల వ్యాపారానికి పాల్పడుతున్న శ్రీ చైతన్య పాఠశాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకత్వాన్ని పోలీసులు అరెస్టు చేసి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు వినయ్, సహాయ కార్యదర్శి బోగేశ్వర్, నాయకులు ఆకాష్, జిల్లా కమిటీ సభ్యులు సందేశ్, సన్నీ, మానస, సంజన, అంజి తదితరులు పాల్గొన్నారు.

# 21న నీట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

జనసైన్యం సిటి

ఈనెల 21న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించే నీట్ పరీక్షను భద్రత నడుమ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో విద్య, వైద్య , ఆర్టీసీ, పోలీస్, ఎన్పీడీసీఎల్ శాఖల అధికారులతో నీట్ పరీక్ష నిర్వహణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 3,001 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5:15 గంటల వరకు ఉంటుందని.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో కంటే ఈసారి పరీక్షకు 15 నిమిషాలు ఎక్కువ సమయం ఉంటుందన్నారు. అభ్యర్థులు పాస్ ఫోటో, గుర్తింపు కార్డు, అడ్మిట్ కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. ఆభరణాలు, షూలు ధరించి రావద్దని.. నిబంధనలు విధిగా పాటించాలని అభ్యర్థులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిర్వహణ, అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అజూంఎశ్రీ అధికారులను.. పరీక్ష కేంద్రం వద్ద మందులతో శిబిరం ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.పరీక్షకు రెండు రోజుల ముందే అధికారులు.. పరీక్షా కేంద్రాలను సందర్శించి




కలెక్టర్ చిత్రా మిశ్రా

ఏర్పాట్లు పరిశీలించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు బృందంగా ఏర్పడి పరీక్ష నిర్వహణను విజయవంతం చేయాలన్నారు.

సెంటర్ కో జిల్లా అధికారి నియామకం

పరీక్షను పకడ్బందీగా నిర్వహించేలా పరీక్ష కేంద్రానికి అదనంగా ఒక జిల్లా అధికారిని నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదే రోజున యోగా దినోత్సవం సందర్భంగా ర్యాలీ ఉంటుంది కాబట్టి విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ చర్యలు చేపట్టాలన్నారు. ప్రశ్నాపత్రం, సమాధాన పత్రాలు రవాణాకు ప్రత్యేక బందోబస్తు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, పరీక్ష నోడల్ ఆఫీసర్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ పంకజ్ సింగ్, డీఈఓ ప్రశాంత్, అశోక్ రెడ్డి, ఏసీపీ సతీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్ లో భారీగా వాహనాలు తనిఖీ



జనసైన్యం సిటి

కరీంనగర్ సిపి ఆదేశాల మేరకు కరీంనగర్ ఆర్టీవో మరియు ట్రాఫిక్ ఏసిపి ట్రాఫిక్ సిఐలు ఎస్ఐలు వారి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది అందులో భాగంగా 100 ఆటోలను పట్టుకొని ఎడ్ కోటర్లులో పెట్టడం జరిగింది. అలాగే కరీంనగర్లో వివిధ కాలేజీల స్కూల్లో బస్సులను తనిఖీ చేశారు. కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం కార్యవర్గం వెళ్లి ఏసిపి గారి ఆర్టీవో వారి తోనే మాట్లాడి ఆటోలను విడిపించడం జరిగింది బొమ్మిడి శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు మన ఏసిపి గారితో మాట్లాడించి విడిపించడం జరిగింది. కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసరెడ్డి ఉపాధ్యక్షులు కొత్తూరు సత్యనారాయణ ఇరవేణి కుమార్. కుకట్ల సంపత్. సహాయ కార్యదర్శులు . ఇరుకుల్లా మహేష్ ప్రచార కార్యదర్శిలు మహమ్మద్ యాకూబ్. బీర్ల రాజు. ఈసీ మెంబర్ కూరుమాచలం వేణుమాధవ్ బొంగాని శ్రీనివాస్ గౌడ్ కాల్వ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



లింగంపల్లి సత్యనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు



సింధు కి జన్మదిన శుభాకాంక్షలు



ఖుషికి జన్మదిన శుభాకాంక్షలు

# గ్రామీణ ఆరోగ్యానికి భరోసా ఆర్ఎంపీ, పీఎంపీలే



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**జనసైన్యం సిటి**

గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఆర్ఎంపీ, పీఎంపీలేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు లేని గ్రామీణ సమాజాన్ని ఊహించుకోలేమని చెప్పారు. అలాంటి వారిపై దాడులు చేయడం సరికాదని, ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరారు. గ్రామీణ వైద్యులు సేవలు నిలిపేస్తే ఆరోగ్య వ్యవస్థ స్థంభించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రధాని నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు ఉదయం మానకొండూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆర్ఎంపీ, పీఎంపీలతో "చాయ్ పే చర్చ" కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదీ 12 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను, ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సమాజంలో అట్టడుగునున్న చిట్ట చివరి వ్యక్తికి సైతం సంక్షేమ ఫలాలు అందించడమే బీజేపీ సిద్ధాంతమని, తూ.చ తప్పకుండా అమలు చేస్తున్న మహనీయుడు మోదీ అని కొనియాడారు. మోదీ పాలనా విజయాలను వివరించడంతోపాటు ప్రజలకు మరింత మేలు చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవసరమైన సలహాలు సూచనలు తీసుకునేందుకు "చాయ్ పే చర్చ" వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లు ఫీల్డులో తమకు ఎదురవుతున్న సమస్యలను ఏకరవు పెట్టారు. కొంత మంది కావాలని తమపై అకారణంగా దాడులు చేస్తున్నారని వాపోయారు. తమపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. మానకొండూరు నియోజకవర్గంలో ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల అసోసియేషన్ సంఘ భవనం లేదని, నూతన భవన నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఆర్ఎంపీలపై దాడులను ఖండించారు. "ఆర్ఎంపీ, పీఎంపీలతో సమాజానికి మంచి జరుగుతోందే తప్ప నష్టం జరగడం లేదు. తక్కువ ఖర్చుతో కుటుంబ సభ్యుల్లా మెలుగుతూ వైద్య సేవ అందిస్తున్నది ఆర్ఎంపీలే. ఆర్ఎంపీలు లేని సమాజాన్ని ప్రజలు ఊహించుకోలేరు. అలాంటి వారిపై దాడులు చేయడం సమర్ధనీయం కాదు. ఆర్ఎంపీలు 10 రోజులు తమ సేవలను నిలిపివేస్తే గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా స్థంభించిపోవడం ఖాయం. గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నది ఆర్ఎంపీలే." అని చెప్పారు.

మోదీ పనితీరు గురించి మాట్లాడుతూ... "మోదీ విజన్ ఉన్న నేత. 10 ఏళ్ల ముందు ఈ దేశం ఎలా ఉంటుందో ఆలోచించి అందుకు అనుగుణంగా కార్యక్రమాలు చేపడతారు. డిజిటల్ విప్లవం అందులో భాగమే. 10 ఏళ్ల ముందు జన్ ధన్ ఖాతాలను ఓపెన్ చేసి డిజిటల్ లావా దేవీలను ప్రారంభిస్తే అందరూ హేళన చేశారు. ఇయాళ ఏమైంది? రోడ్డుపై చాయ్ అమ్ముకునే వ్యాపారాలు కూడా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా లావా దేవీలు జరుపుతున్నారు. ఒక్క రూపాయి అవినీతికి తావు లేకుండా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదును దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారుడి ఖాతాలోనే పడుతోంది."అని చెప్పారు. 12 ఏళ్ల పాలనలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జరిగిన అభివృద్ధిపైనా మాట్లాడారు. తన ఏడేళ్ల ఎంపీ పదవీ కాలంలో రూ.22 వేల కోట్లకు పైగా నిధులొచ్చాయన్నారు. విద్య, వైద్య, మౌలిక సదుపాయాల రంగాలకు పెద్ద ఎత్తున నిధులిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలోనూ బీజేపీ సర్కార్ వస్తే... కేంద్ర నిధులు దుర్వినియోగం కాకుండా ఉంటాయన్నారు. "మా ప్రాధాన్యత విద్య, వైద్యం. పేద వాడికి కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తాం. మానకొండూరు లో ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లకు సంక్షేమ భవన్ విషయంలో ల్యాండ్ చూపిస్తే సంఘ భవన నిర్మాణానికి తప్పకుండా ఆర్థిక సాయం అందిస్తా."అని చెప్పారు. అందరికీ ఇచ్చారు అధికారం... ఈసారి బీజేపీకి ఇవ్వండి అవకాశం అంటూ అభ్యర్థించారు.

# అక్రమ చొరబాటుదారుల ఓట్లను తొలగిస్తే తప్పేంది?



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**జనసైన్యం సిటి**

విదేశీ అక్రమ చొరబాటుదారుల ఓట్లను తొలగిస్తే తప్పేముందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. విదేశీ ముస్లింలతో ఈ దేశ ముస్లింలను ఎందుకు పోలుస్తున్నారని కాంగ్రెస్ ను ప్రశ్నించారు. మతాల మధ్య కాంగ్రెస్ చిచ్చు పెట్టి రాజకీయ లబ్ది పొందేందుకే సర్ ను వ్యతిరేకిస్తోందన్నారు. వాస్తవానికి ఈ దేశ పౌరుల ఓట్లను తొలగించే హక్కు ఏ ఒక్కరికీ లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ సహా విదేశీ అక్రమ చొరబాటుదారుల ఓట్లను తొలగించాలా? వద్దా? అనే అంశంపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మెట్రో రెండో దశను అడ్డుకుంటున్నారని సీఎం చేస్తున్న వ్యాఖ్యల్లో వాస్తవం లేదని కొట్టిపారేశారు. తెలంగాణ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కిషన్ రెడ్డి అడ్డుకోవాలని అనుకుంటే తెలంగాణకు ఇంత పెద్ద ఎత్తున నిధులు, ప్రాజెక్టులు ఎందుకు వస్తున్నాయో ఆలోచించాలని కోరారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, బీజేపీకి కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరంలేదని అన్నారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లకు సైతం మోదీ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల నిధులిస్తోందన్నారు. బీఆర్ఎస్ పార్టీలో మావోయిస్టు భావజాలం ఉన్న నేతలు ఉన్నారని కవిత చేసిన వ్యాఖ్యల్లో నిజం ఉందని చెప్పారు. అలాంటి నేతలతోనే సమాజానికి పెను ప్రమాదమని అన్నారు. మావో భావజాలం, తుపాకీ గొట్టంతో సాధించేదేమీ లేదనే నిజాన్ని గ్రహించే మావోయిస్టు నేతలంతా ప్రభుత్వం వద్ద లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసిపోయారని చెప్పారు. మావోయిస్టు భావజాలాన్ని వీడకపోతే భవిష్యత్తులో వారికే నష్టమని బీఆర్ఎస్ లోని మావో భావజాల నేతలను హెచ్చరించారు. మోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కేంద్ర విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో వివిధ వర్గాలతో నేతలను కలిసి అనేక కార్యక్రమాలు చేపడుతున్న బండి సంజయ్ కుమార్ అందులో భాగంగా మానకొండూరు లోని ఓ ఫంక్షన్ హాలులో ఆర్ఎంపీ డాక్టర్లతో "చాయ్ పే చర్చ" కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే...

దేశ చరిత్రలో 4400కు పైగా రోజులు ప్రధానిగా చేపట్టిన చరిత్ర నరేంద్రమోదీకే దక్కింది. ఈ నేపథ్యంలో బీజేపీ దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేస్తోంది. అందులో భాగంగానే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలపై విస్తృత కార్యక్రమాలు చేస్తున్నాం. వివిధ వర్గాల నేతలను కలుస్తున్నాం. ఈరోజు ఆర్ఎంపీలతో భేటీ అయ్యాం.గత 10 ఏళ్ల యూపీఏ పాలనను, మోదీ 12 ఏళ్ల పాలనను బేరీజు వేసుకోవాలి. అభివృద్ధి, సంక్షేమం, అవినీతి విషయంలో ఎవరి పాలన బాగుందో ఆలోచించాలి. 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ ప్రణాళిక బద్దంగా దేశాన్ని పాలిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. తెలంగాణ అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తున్నారు.దేశవ్యాప్తంగా మోదీ రెండున్నరేళ్లలో 12 లక్షల ఉద్యోగాలను అవినీతికి తావు లేకుండా మెరిట్ ప్రాతిపదికపైనే భర్తీ చేశారు. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తున్నారు. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేకిన్ ఇండియా పేరుతో విదేశీ ఉత్పత్తులపై ఆధారపడకుండా స్వదేశీ ఉత్పత్తును ఎగుమతి చేసే స్థాయికి తీసుకొచ్చారు. రాబోయే రోజుల్లో ఏయే కార్యక్రమాలు చేపడితే ప్రజలకు మంచి జరుగుతుందో సూచనలు,సలహాలు తీసుకోవాలనే ఉద్దేశంతోనే వివిధ వర్గాలను కలుస్తున్నాం.

తెలంగాణ విషయానికొస్తే... 12 ఏళ్లలో 12 లక్షల కోట్ల రూపాయలకుపైగా నిధులను కేంద్రం ఇచ్చింది. తెలంగాణలోనూ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే అభివృద్ధి ఖాయం. లేనిపక్షంలో కేంద్ర నిధులు దారి మళ్లుతున్నాయి. కేంద్ర సంక్షేమ పథకాలు కూడా దారి మళ్లే ప్రమాదం ఉంది. అందరికీ ఇచ్చారు అధికారం... ఒక్కసారి బీజేపీకి ఇవ్వండి అవకాశం.బీఆర్ఎస్ లో మావోయిస్టు భావజాలం ఉన్న నాయకులు ఉన్నారని కవిత చెప్పిన మాటలు ముమ్మాటికీ వాస్తవం. సమాజంలో అలాంటి వారు ఉన్నత స్థానంలో ఉండటంవల్లే సమాజానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. తుపాకీ గొట్టం ద్వారా అమాయకులను చంపి సాధించినదేమిటి? అమాయకుల ప్రాణాలు కోల్పోయారు. అభం శుభం తెలియన మైనర్ పిల్లలు తుపాకీ పట్టి చనిపోయారు. చివరకు మావోయిస్టు పార్టీయే అంతమైపోయింది. తుపాకీతో సాధించేదేమీ లేదని గుర్తించి మావోయిస్టు అగ్ర నేతలు ప్రభుత్వం వద్ద లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. మావోయిస్టు భావజాలం ఉన్న నేతలు కూడా ఆ భావజాలాన్ని వీడి అభివృద్ధికి సహకరించాలి. లేనిపక్షంలో వాళ్ల భవిష్యత్తుకే ఇబ్బందిగా పరిణమిస్తుంది.మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉంది. అడ్డుకునే భావనే ఉంటే తెలంగాణకు ఇంత పెద్ద ఎత్తున నిధులు, ప్రాజెక్టులు ఎందుకు వస్తాయి? ఒక్క మెట్రోనే అడ్డుకోవాల్సిన అవసరం కిషన్ రెడ్డికి ఏముంది? అసత్య ఆరోపణలను ప్రజలు పట్టించుకోవడం లేదు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల అభివృద్ధికి కట్టుబడి వేల కోట్లు నిధులిస్తున్నాం. ప్రజలు మా నిబద్ధతను గుర్తిస్తున్నారు. కాంగ్రెస్ సర్టిఫికెట్ మాకు అవసరం లేదు.

ఈ దేశ పౌరుల ఓట్లను తొలగించే హక్కు ఎవరికీ లేదు. ఎస్ఐఆర్(సర్) విషయంలో కాంగ్రెస్ పార్టీ రెండు మతాల మధ్య చిచ్చు పెడుతున్నారు. విదేశీ ముస్లిం చొరబాటుదారులను ఈ దేశ ముస్లింలతో పోల్చి కాంగ్రెస్ అవమానిస్తోంది. ఇక్కడి ముస్లిం ఓట్లను తొలగించి విబేధాలు సృష్టించేందుకు కుట్ర చేస్తోంది. నేనడుగుతున్నా.... పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుండి అక్రమ చొరబాటు దారులు పాస్ పోర్టు, వీసా లేకుండా చొరబడి ఓటర్ కార్డు పొందితే చూస్తూ ఊరుకోవాలా? వాటిని తొలగించాలని ఎందుకు కాంగ్రెస్ అడగడం లేదు? విదేశీ అక్రమ చొరబాటుదారులకు ఓటు హక్కు ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందా? అసలు విదేశీ ముస్లింలను స్వదేశీ ముస్లింలతో ఎందుకు పోలుస్తున్నారు? ఇక్కడి ముస్లిం సమాజానికి కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి. అక్రమంగా వలస వచ్చిన వాళ్ల ఓట్లను మాత్రమే తొలగిస్తాం. తొలగించాలా? వద్దా? కాంగ్రెస్ సమాధానం చెప్పాలి. బెంగాల్ లో అక్రమ వలసదారుల ఓట్లను తొలగించాం తప్పేముంది?

# వైభవంగా వరుణాభిశేకము వరుణ యాగం



**జనసైన్యం సిటి**

స్థానిక పంచముఖ హనుమదీశ్వర స్వామి దేవాలయంలో అష్టోత్తర శత కలశ వరుణాభిషేకం మరియు వరుణయాగం వైభవంగా జరిగింది. ప్రముఖ జ్యోతిష్య వాస్తు ఆగమ శాస్త్ర పండితులు శ్రీమాన్ శ్రీ నమిలకొండ రమణాచార్య స్వామి వారి ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం జూన్ 16వ తేదీ వచ్చిన మృగశిర కార్తె సగం అయిపోయిన ఎండ వేడి తగ్గక విపరీతమైన ఉడకపోతతో జనాలు బాధపడుతుండటంతో వాతావరణ శాంతికి లోకకళ్యాణార్థమై 108 కళశాలతో పంచ సూక్తాలతో, పంచోపనిషత్తులతో, పంచామృతాలతో, మన్యుసూక్తంతో, రుద్ర నమక చమకాల వేద మంత్రాలతో శివునికి, ఆంజనేయ స్వామికి అభిషేకం నిర్వహించి అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం వరుణ మూలమంత్రాలతోని హోమ కార్యక్రమాన్ని వరుణయాగాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మయూరగిరి పీఠాధీశులు ప్రముఖ జ్యోతిష్య వాస్తు ఆగమ శాస్త్ర పండితులు శ్రీమాన్ శ్రీ నమిలకొండ రమణాచార్యులు రామకృష్ణమాచార్యులు వినయ్ కుమార్ స్వామి అర్చకులు రామాచార్యులు ఆలయ కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు హనుమత్ దీక్షాపరులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు.. రమణాచార్య స్వామి మాట్లాడుతూ పూర్వకాలంలోగారిని వానలు పడకపోతే ఆంజనేయ స్వామికి అభిషేకం రోకలితో కప్పతల్లి ఆటలు ఆడేవారని దాని ద్వారా వరుణుడు సంతోషించి వర్షాలు కురిపించే వారిని పూర్వకాలపు ఆచారం దాన్ని దృష్టిలో ఉంచుకొని వేదోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలియపరిచారు అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు..

# ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే ఊరుకునేది లేదు

**జనసైన్యం సిటి**



ఈ విద్యా సంవత్సరం మొదలైన తరుణంలో ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేసినట్లయితే చూస్తూ ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి టేకుల శ్రావణ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వారి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేసినట్లయితే ఊరుకోమని అదేవిధంగా పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు అధిక ధరలకు విక్రయించినట్లయితే భౌతిక దాడులకు సైతం దిగుతామని హెచ్చరించారు.ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులపై మోయలేని భారం వేస్తూ ప్రభుత్వ నియమ నిబంధనలు బే ఖాతరు చేస్తూ వివిధ పాఠశాలలు నర్సరీ నుండి పదో తరగతి వరకు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఈ విషయమై గౌరవ ముఖ్యమంత్రి గారు మరియు ప్రభుత్వం కూడా దృష్టి సారించారని ప్రభుత్వం నుండి సరైన ఫీజులు పట్టిక జీవో విడుదల అయ్యే వరకు వేచి ఉండాలని ఒకవేళ ప్రభుత్వ నియమ, నిబంధనలు ఉల్లంఘించి అధిక ఫీజులు వసూలు చేసినట్లయితే ఆయా పాఠశాలల వద్ద ఆందోళన మరియు నిరసన కార్యక్రమం చేపడతామని అన్నారు. తల్లిదండ్రులు ఎవరు ఆందోళన చెంది పాఠశాల యాజమాన్యాలు చెప్పిన విధంగా ఫీజులు కట్టవద్దని అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయించవద్దని సూచించారు. ఒకవేళ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు తల్లిదండ్రులను బెదిరింపులకు గురిచేసి పార్టీ పుస్తకాల పేరిట మరియు ఫీజుల పేరిట అడ్మిషన్ ఫీజుల పేరిట డబ్బులు వసూలు చేసినట్లయితే జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు కలుపుకొని పలు నిరసన కార్యక్రమాలు తెలుపుతామని హెచ్చరించారు.

# అలయాల కమిటీ చైర్మన్ గా కోటగిరి కిరణ్



**జనసైన్యం సిటి**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని వేములకుర్తి గ్రామంలో అలయకమిటీ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది.నుతన అలయ కమిటి ఎర్పాటు 16 కులసభ్యులు కలిసి సమావేశం నిర్వహించుకున్నారు. అలయకమిటీ చైర్మన్ గా కోటగిరి కిరణ్, ఉపాధ్యక్షుడి గా బుర్రి ముత్యం,కోశాధికారి గా కత్రోజి సాయి కుమార్,రైటర్ గా గుడ్ల అశోక్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అలయకమిటీ సభ్యులు గా తులి శ్రీధర్,తోట రాజగౌడ్,అరె నారయణ,దోనికెన జగదిశ్,బస మల్లెష్,రాధారపు లింగం, బక్కి పోశయ్య,మైలరపు గంగాధర్, బుక్య కైలాష్,నేమురి అశోక్,కుంబల మల్లయ్య,కనుక రాజేంధర్,కుంబాల నారయణ లతో నుతన కమిటీ ఎర్పాటు జరిగింది. కమిటీ ఎర్పాటు అనతరం అతి పురతన శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి అలయం లో ప్రత్యేక పుజలు నిర్వహించారు. నుతన కమిటీ సభ్యులకు అలయ అర్చకులు మంత్రరాజం జానకిరామకృష్ణ చార్యులు,పాలిక మణిదిప్ చారి ఆశీర్వచనం చేశారు. నుతన అలయ కమిటీ సభ్యులను గ్రామస్తులు,యువకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# మొసళ్లను అంతరించకుండా చూసుకుందాం !

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

(17 జూన్ "ప్రపంచ మొసలి దినోత్సవం" సందర్భంగా)



మొసళ్లు జీవించి ఉన్న సరీసృపాల్లో అతి పెద్దవిగా వర్గీకరించబడ్డాయి. అంతరించిపోతున్న మొసళ్లు, ఎల్లీగేటర్ల సంరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి, జీవ వైవిధ్యాన్ని కాపాడడానికి ప్రతి ఏటా 17 జూన్ రోజు "ప్రపంచ మొసలి దినోత్సవం (వరల్డ్ క్రొకడైల్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. పర్యావరణ వ్యవస్థలో ముఖ్యమైన మొసళ్ల పట్ల అవగాహనలో భాగంగా జూ పార్కులు, వన్యప్రాణి సంరక్షణ సంస్థలు పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తాయి. మొసళ్లను పెంచడం, విడుదల చేయడం అనే పద్ధతినా అవలంభించి వాటి సంరక్షించే ఆవాసాలను సృష్టించి, బందీగా ఉంచి సంతానోత్పత్తిని, అవగాహనను పెంచడం జరుగుతుంది. ప్రపంచ మొసలి దినోత్సవం-2026 ఇతివృత్తంగా "ప్రతి పొలుసులో ఒక వారసత్వం (లెగసీ ఇన్ ఎవ్రీ స్కేల్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

**భారతదేశంలో మొసళ్ల జనాభా, వాటి ఆవాస కేంద్రాలు:**

1975లో భారత్‌లో ఒడిసా భితార్కనికా జాతీయ ఉద్యాన వనంలో "క్రొకడైల్ కన్జర్వేటరీ ప్రాజెక్ట్" ప్రారంభించారు. మంచినీటి చిత్తడి నేలలు, సరస్సులు, నదుల్లో ఇవి జీవిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా మొసళ్లు, ఎలిగేటర్లు, కైమన్లు, ఘరియల్ అనే రకాలు ఉన్నాయి. శీతల రక్త జంతువులుగా మొసళ్లు నిశాచర జీవులు.ప్రపంచంలోని అడవి ఘరియాలో జనాభాలో 80 శాతం భారతదేశంలోనే ఉన్నాయి. నేషనల్ చంబల్ అభయారణ్యం, కటార్నియా ఘాట్, సోన్ ఘరియాల్ అభయారణ్యం వంటి ప్రదేశాల్లో సుమారు 3,000 వరకు ఉన్నాయి. భారతంలో ఉప్పునీటి మొసళ్ల జనాభా 2,500 వరకు పునరుద్ధరించబడింది. నేటికి మొసళ్ల సంరక్షణకు 50 ఏండ్లు పూర్తి అయిన సందర్భంగా మరింత చొరవ తీసుకొని మొసళ్లను కాపాడుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం భారతంలో ఘారియల్, మగ్గర్, ఉప్పునీటి మొసలి అనబడే మూడు ప్రధాన జాతులు ఉన్నాయి. మొసళ్ల ఆవాసాల నష్టం, అక్రమ వేటగాళ్లు, గుడ్లను వేటాడడం, కాలుష్యం, నదీతీర వ్యవసాయం, కృత్రిమ కట్టలు, బ్యారేజ్‌లు, ఆనకట్టల నిర్మాణాలు, అక్రమ ఇసుక తవ్వకాలు లాంటి కారణాలతో మొసలి జాతి తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటున్నది.

తెలంగాణలో మంచిర్యాల జిల్లాలోని 'శివ్వారం వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం", సంగారెడ్డి జిల్లాలో "మంజీరా వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం" ఉన్నాయి. అదే విధంగా మెదక్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల్లో కూడా ఇవి కనుపిస్తాయి.

మాంసాహార మొసళ్లు జలాల్లోని చేపలు, ఇతర జంతువులను నీటిలోకి లాగి తింటాయి. మొసలి జాతి 5 నుంచి 20 అడుగుల పొడవు వరకు ఉంటాయి. మొసళ్ల జనాభాను పెంచడానికి వాటి ఆవాసాలను సంరక్షించుకోవడం, ఇసుక తవ్వకాలు తగ్గించడం, అక్రమ వేటగాళ్ల చేతులకు బేడీలు వేయడం, జల కాలుష్యాన్ని తగ్గించడం లాంటి పలు చర్యలకు దీర్ఘకాలిక ప్రాతిపదికన ఆచరించాలి. ప్రకృతిలోని ప్రతి ప్రాణిని కాపాడుకుంటేనే జీవ వైవిధ్యం పరిరక్షించబడుతుందని గమనించి తగు సంరక్షణ చర్యలు తీసుకుందాం.

# మూడవ డిస్కాం ను రద్దు చేయాలి

**జనసైన్యం సిటి**




తెలంగాణ రాష్ట్రంలో కనీస వేతనాలను సవరిస్తూ 30-05-2026న జీఓ ఎంఎస్ నెం.6ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. మూడు జోన్లుగా, కార్మికులను 4 కేటగిరీలుగా విభజించింది. కరీంనగర్ జిల్లా లోని పాల డైరీలు, సా మిల్లులు, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్స్, పెట్రోల్ బంకులు, హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్ లలో ఈ జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వి రమ డిమాండ్ చేశారు.సిఐటియు జిల్లా ఆఫీసు ముకుందలాల్ మిశ్రా భవన్ లో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు శ్రీనివాస్, గీట్ల ముకుంద రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం శ్రీలత, సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, పున్నం రవి, జి రాజేశం గార్లతో కలిసి ప్రెస్ మీట్ లో మాట్లాడారు.విద్యుత్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు డిస్కాం అనే పేరుతో కొత్త డిస్కాం ఏర్పాటు చేసింది. ఇది రైతులకు, సామాన్య, మధ్యతరగతి వినియోగదారులకు తీవ్ర నష్టదాయకమైందని దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అప్పుల ఉబిలో కూరుకుపోయిన డిస్కాంలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.45,398 కోట్లను వెంటనే విడుదల చేయాలని సిఐటియు కోరుతుందన్నారు. రైతులు, సామాన్య, మధ్యతరగతి విద్యుత్ వినియోగదారులకు పెను భారం కానున్న డిస్కాముల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ స్థాయి వరకు సభలు, సమావేశాలు, ప్రజా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా తెలిపారు.ఆర్టీసి సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలని, పెండింగ్ సమస్యలపై కార్మిక సంఘాలతో ఈడి కమిటీ చర్చలు జరుపాలి. విద్యుత్ బస్లు ఆర్టీసీ నడిపేలా విధాన మార్పులు చేయాలి. ఉద్యగ భద్రత కల్పించాలి. మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీకి రావలిసిన బకాయిలు చెల్లించాలని కోరారు.ఆశా వర్కర్లను కనీస వేతనం రూ.18,000/- పెంచి, రూ.50 లక్షల బీమా, రూ.50,000 మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్లు తదితర సౌకర్యాలు అమలు చేసి, కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ.1500/- పారితోషకాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఐసిడిఎస్ ను బలోపేతం చేయాలని, ఫ్రీ ప్రైమరీ, పిఎంశ్రీ విద్యను అంగన్వాడీలకే ఇవ్వాలని, రూ.18,000/- కనీస వేతనం చెల్లించాలని, చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి పని భారాన్ని తగ్గించాలి. వేధింపులు ఆపాలి. 104 సిబ్బందికి 14 నెల వేతనాలు బకాయిలు చెల్లించాలి. పేషంట్ కేర్, శానిటేషన్ సెక్యూరిటీ తదితర ప్రభుత్వ హాస్పటల్స్‌ని కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలన్నారు.గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ పని విధానం రద్దు చేసి 5 నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, 2వ పిఆర్సీ ప్రకారం కనీస వేతనం నిర్ణయించి, గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు కల్పించాలని, అనారోగ్యానికి గురైన వారికి, 60 సంవత్సరాలు పైబడిన, ప్రమాదంలో మరణించిన, లాంగ్ అబ్సెంట్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను నియమించాలని అన్నారు.భవన నిర్మాణం కార్మికులకు (సిఎస్సీ) హెల్త్ టెస్టులు రద్దు చేసి, ఇన్సూరెన్స్ కంపెనీల ఇచ్చిన స్కీంలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. హమాలీలందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణితో ఉన్నది. ఈ నేపథ్యంలో కార్మికులు మరిన్ని సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



## దేవ అనిల్‌కు జన్మదిన శుభాకాంక్షలు



## శ్రీనివాస్ కి జన్మదిన శుభాకాంక్షలు

# సారవంతమైన నేలల్ని నిస్సార ఎడారులుగా మార్చుతున్నామా !

(17 జూన్ “ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినోత్సవం” సందర్భంగా)

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**



నిస్సార భూమికి తిరిగి జీవం పోసే శక్తి మనకు ఉంది. నేలల్ని పునరుద్ధరిస్తే పలు నూతన అవకాశాలు సృష్టించబడతాయి. నేడు అలాంటి అవకాశాలకు ద్వారాలు తెరవాల్సిన సమయం ఆసన్నం అయ్యింది. ఆరోగ్యకర పర్యావరణం మీదనే 50 శాతం ప్రపంచ జిడిపీ ఆధారపడి ఉంటుంది. నేడు ప్రతి ఏట ఈజిప్ట్ దేశమంత భూభాగం క్షీణించిపోతున్నది. దీని వల్ల జీవవైవిధ్యానికి నష్టం వాటిల్లడం, కరువులు పెరగడం, ధరలు పెరగడం, అస్థిరత రాజ్యమేలడం, పౌర సమాజం వలసల స్థానభ్రంశం చెందడం జరుగుతుంది. భూమిని పునరుద్ధరిస్తే ఉత్పాదకత పెరగడం, ఆహార భద్రత సాధించడం, నీటి చక్రాలు బలపడడం, గ్రామీణులకు జీవనోపాధులు పెరగడం జరుగుతుంది.

**ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినం-2026 ఇతివృత్తం:**

భూ క్షీణత, కరువులు అనేవి అవిభాజ్యమైన అనర్థాలు. వీటి వల్ల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతుంది, ఆహార ఉత్పత్తులు తగ్గుతాయి, జీవన నాణ్యతకు కోతపడుతుంది, నీటి లభ్యతకు గండి పడుతుంది. నేల క్షీణత, ఎడారీకరణ అనర్థాలను అడ్డుకోవడం, పునరుద్ధరించడం లాంటి అంశాలను చర్చించడానికి ప్రతి ఏట 17 జూన్ రోజున “ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినోత్సవం” పాటించాలని 1994లో ఐరాస తీర్మానించడం, 1995 నుంచి పాటించడం జరుగుతున్నది. 2026 ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినం ఇతివృత్తంగా “రేంజ్‌ల్యాండ్స్ : గుర్తించండి. గౌరవించండి. పునరుద్ధరించండి” అనబడే అంశాన్ని తీసుకొని కొలంబియాలో సమావేశం నిర్వహిస్తున్నారు. ప్రకృతికి పునాది సారవంతమైన నేల. ఇలాంటి ఆరోగ్యకర భూములను మానవ, ప్రకృతి ప్రమేయాలతో నిస్సారం, నిర్వీర్యం చేయడం జరుగుతోంది. ఇలాంటి నేల క్షీణత మరికొంత కాలం కొనసాగితే శాశ్వతంగా పనికి రాని ఎడారులుగా మారి పోతాయని గమనించాలి. నేల ఎడారీకరణను అడ్డుకోని యెడల రాబోయే 25 ఏండ్లలో 12 శాతం ఆహార ఉత్పత్తులు పడిపోయి 30 శాతం వరకు సరుకుల ధరలు పెరుగుతాయి.

**హరిత విప్లవంతో ఆహార భద్రత, అటు తర్వాత...!**

ఆహార అభద్రత ఉచ్చులో చిక్కుకున్న భారతంలో వ్యవసాయ ఉత్పత్తులను గణనీయంగా పెంచడానికి 1960ల్లో నార్మన్ బోర్లాంగ్ నాయకత్వంలో “హరిత విప్లవం” రావడం. సాగు దిగుబడులు పెరగడం, ఆహార భద్రత సాధించడం జరిగినప్పటికీ ఒకే రకమైన వరి, గోధుమ పంటలను దశాబ్దాలుగా పండించడం కారణంగా సారవంతమైన నేలల నాణ్యత క్షీణించడం, ఎడారీకరణ అంచున నిలబడడం జరిగింది. ఇప్పటికే రాజస్థాన్, పంజాబ్, యూపీ, బీహార్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో దాదాపు 5 మిలిమన్ హెక్టార్ల వ్యవసాయ నేలలు ఎడారీకరణ అంచున చేరాయి. అవగాహన లేమి, అశాస్త్రీయ సాగు పద్ధతులతో సారవంతమైన నేలలు నిస్సారమై ఎడారి భూములుగా మారడాన్ని నేల ఎడారీకరణ అంటారు. ఎడారీరకణతో కరువుకు విడదీయరాని సంబంధం ఉంటుంది. అడవుల నరికివేత, పశుగ్రాస అధిక వినియోగం, పోడు వ్యవసాయం, రోడ్ల నిర్మాణం, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, ఒకే రకమైన పంటల్ని ఏండ్ల తరబడి వేయడం లాంటివి కూడా నేల ఎడారీకరణను వేగవంతం చేస్తాయి.

**ఎడారీరకణలో పేదరికం, ఆకలి చావులు:**

నేల ఎడారీకరణ సంక్షోభంతో 3 బిలిమన్ల మానవాళి పేదరికంలోకి నెట్టబడడం, ఒక బిలియన్ ప్రజలు ఆకలి చావుల అంచున నిలబడడం జరుగుతున్నది. వ్యవసాయ నేలలకు సారం అందించని యెడల క్రమంగా శుష్క భూములుగా మారుతూదిగుబడులు తగ్గుతూ, కోసుకోలేని ఎడారులుగా మారతాయి. అతిగా కృత్రిమ ఎరువులు వాడడం, విచక్షణారహితంగా రసాయనాలు వాడడం, అధిక నీటిని వినియోగించడం, అతిగా పురుగు మందులు వాడడం, అశాస్త్రీయ సాగు పద్ధతులు లాంటి అంశాల వల్ల తాత్కాలికంగా దిగుబడులు పెరిగినా, క్రమంగా నేలలు నిస్సారమై ఎడారులను తలపిస్తాయి.

మానవ కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డలను అందించడానికి సారవంతమైన నేలలు ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. నేల సారాన్ని కాపాడుకుంటూ, నాణ్యమైన మట్టి వాసనను ఆస్వాదిస్తూ, మట్టి మర్యాదను గౌరవిస్తూ, మట్టిలోంచి మాణిక్యాలను పండిద్దాం.

# ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి



**జనసైన్యం సిటి**

ప్రైవేట్ పాఠశాలలు కళాశాలలు తమ ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తూ తల్లిదండ్రులను పిప్పి పిలుస్తున్నారు ప్రభుత్వం వెంటనే ఫీజులు నియంత్రణ చట్టాన్ని అమలు చేసి ఏఏ పాఠశాలకు ఎంత ఫీజులు ఏ కళాశాలలకు ఎంత ఫీజులు అని ప్రభుత్వం నియంత్రణ చేయాల్సి ఉంది ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల కళాశాల దోపిడీని అరికట్టాలి ప్రభుత్వం లక్షలాది రూపాయలు తల్లిదండ్రుల నుండి దోచుకున్న దీనిని పట్టించుకోవడం లేదు జిల్లా స్థాయిలో పర్యవేక్షించాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారి మండల విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలలతో కుమ్ముకవుతున్నారు ఎన్ని ఫిర్యాదు చేసిన దానిపై చర్యలు లేవు విచారణ లేదు యదేచ్ఛగా దోపిడీ చేయడానికి వారికి లైసెన్స్ ఇచ్చే విధంగా ప్రవర్తిస్తున్నారు. G.O. MS NO 91 తేదీ 6-08-2009 ప్రకారం ప్రైవేటుపాఠశాలలు కనీసం మూడు దుకాణాల వివరాలను ప్రకటించాలి. పుస్తకాలు నోట్బుక్స్ స్టేషనరీని స్కూల్ కౌంటర్లో విక్రయించిన అది No profit No loss ప్రతిపాదకన మాత్రమే ఉండాలి. తల్లిదండ్రులు నిర్దిష్ట దుకాణం లేదా స్కూల్ నుంచి కొనుగోలు చేయాలని బలవంతం చేయరాదు. నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు బుక్కులు డ్రెస్సులు అమ్మిన విద్యాశాఖ అధికారి తెలిసిన ఏమీ తెలియనట్లు ప్రవర్తిస్తున్నారు దీనిపై ఇప్పటికైనా అధికారులు స్పందించాలని లేని పక్షాన విద్యాశాఖ అధికారుల తీర్పు నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు , నిరాహార దీక్షలు నిర్వహిస్తా మనీ బీసీ సంక్షేమ సంఘం నాయకులు దొగ్గలి శ్రీధర్ యువజన సంఘం నాయకులు మాదాసు సంజీవ్ తెలిపారు.

## కళాకారుడు వేముల అశోక్‌కు తెలంగాణ స్ఫూర్తి నంది పురస్కారం



**కొడిమ్యాల జన సైన్యం న్యూస్.**

వైద్య వృత్తిలో సేవలందిస్తూనే కళారంగంలో తన ప్రతిభను చాటుకుంటున్న జమ్మికుంట మండల పరిధిలోని జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన కళాకారుడు వేముల అశోక్‌కు అరుదైన గౌరవం దక్కింది. కళాకారులను ప్రోత్సహిస్తూ,వారిలోని నైపుణ్యాలను వెలికితీసి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో ఆయన విశేష కృషి చేస్తున్నారు. జమ్మికుంట మండల కళాకారుల సంఘం అధ్యక్షుడిగా సేవలందిస్తున్న అశోక్ చేసిన సేవలను గుర్తించిన తెలుగు వెలుగు సాహితీ వేదిక సంస్థ ఆయనను “తెలంగాణ స్ఫూర్తి నంది పురస్కారం”తో సత్కరించి జ్ఞాపికను అందజేసింది. ఈ సందర్భంగా వేముల అశోక్ మాట్లాడుతూ, జమ్మికుంట మండలం పరిధిలోని గ్రామీణ ప్రాంతాల కళాకారులను గుర్తించి వారికి మెరుగైన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కళారంగ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తూ కళాకారుల ప్రోత్సాహానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

## తెలంగాణ రక్షణ సేన ఆద్వర్యంలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేద్దాం.

**జనసైన్యం సిటి**

తెలంగాణ ఉద్యమ పోరాటం, అస్థిత్వం, ఆత్మగౌరవం, ఉద్యమ ఆకాంక్షలు భవిష్యత్ కార్యాచరణ అనే అంశం పై తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఈనెల పద్దెనిమిదివ తేదీన నగరంలోని జుచీ గార్డెన్స్ లో ఉదయం పది గంటల నుండి మద్యాహ్నం రెండు గంటల వరకు జరుగుతుంది. ఈ సమావేశాన్ని విజయవంతం చెయ్యాలని కోరుతూ ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవితమ్మ గారు హాజరు అవుతున్నారని ఈ సమావేశానికి తెలంగాణ ఉద్యమకారులను, వివిధ రాజకీయ పార్టీల నాయకులను, ప్రజా సంఘాల ప్రతినిధులను, మేధావులను, బిసి సంఘాల నాయకులను, కుల సంఘాల నాయకులను, మహిళ సంఘాల ప్రతినిధులను, కార్మిక సంఘాలను, రైతు సంఘాలను, విద్యార్థి, యువజన సంఘాలను, కవులు, కళాకారులు, రచయితలు ఇలా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడిని ఈ సమావేశానికి అహ్వానించడం జరిగిందని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణ కోసం తమ అభిప్రాయాలతో పాటు భవిష్యత్ చెప్పటబోయే కార్యచరణ పైన సమాలోచనలు చేసే విధంగా వారి యొక్క అమూల్యమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.



# కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త




బ్యాడ్మింటన్ . టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు రంగంలో ఆసక్తిగలవారికి గంటకు 300 రూపాయల చొప్పున కోర్టును, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు ఆటకు ఇవ్వబడును. ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి ఇవ్వబడును

బుకింగ్ చేసుకోవాల్సిన ఫోన్ నెంబర్ 9246966660



## ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు






మన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .క్యారం బోర్డు. చెస్. వంటి క్రీడలను ఇప్పుడు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇవ్వబడును. నిపుణులైన కోచులచే బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు వంటి క్రీడలలో శిక్షణ ఇవ్వబడును.కరీంనగర్ జిల్లా లోని విద్యార్థినీ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచునులచే శిక్షణ ఇవ్వబడును.

ఆట వేళలు


ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

ఇండోర్ స్టేడియం క్రీడాకారుల కోసం తెరిచి ఉంచబడును. కావున ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం మరియు ఆట ఆడుకునే అందుకోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.9246966660








జనచిత్రం

## జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ విజేతలకు డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు అభినందనలు



**జనసైన్యం సిటి**

జిల్లా కేంద్రంలోని బ్యాడ్మింటన్ అకాడమీలో రెండు రోజుల పాటు ఉత్సాహంగా జరిగిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో సత్తా చాటిన యువ క్రీడాకారులను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ మరియు మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు సన్మానించారు.కరీంనగర్ డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో బ్యాడ్మింటన్ లో గెలిచిన విజేతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచి అండర్-11 (సింగిల్స్ ఉ డబుల్స్) విభాగంలో విజేతగా నిలిచిన లకిడి సూర్య, అలాగే అండర్-13 (సింగిల్స్ & డబుల్స్) విభాగంలో విజయం సాధించిన లకిడి శౌర్యలను. యాదగిరి సునీల్ రావు ప్రశంసించారు. చిన్న వయసులోనే క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న వీరు, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి కరీంనగర్ జిల్లాకు మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులతో పాటు వారి బ్యాడ్మింటన్ కోచ్ శ్రీ జి. లక్ష్మణ్ మరియు పాల్గొన్నారు.

## నూతన విద్యా సంవత్సరానికి కొత్తగా ముస్తాబైన రైలు బడి



**జనసైన్యం సిటి**

ఇల్లంతకుంట మండలం ఎంపీపీ ఎస్ కందికట్కూరు ఎస్సీ కాలనీ పాఠశాల రైలు బడి కొత్త విద్యా సంవత్సరానికి గాను సర్వాంగ సుందరంగా ఆహ్లాదకరమైన వాతావరణంతో విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపే విధంగా సిద్ధమై ఉన్నది. దాదాపు 45 మంది తో రైలు బడిలో సీట్లు రిజర్వ్ అయ్యి ఉన్నప్పటికీ..అమావాస్య మంగళవారం సెంటిమెంట్లతో విద్యార్థులు రైలు బండి ఇంకా ఎక్కట్లేదు..ఉపాధ్యాయ ప్రధానోపాధ్యాయుల సమాచారం ప్రకారం.. బుధవారం నుండి విద్యార్థుల సంఖ్య క్రమేణ పెరుగుతుందని గురువారం రోజున వైభవంగా జరగబోవు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమ మునకు పెద్ద ఎత్తున విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పుర ప్రముఖులు హాజరవుతారని తెలుస్తున్నది..

## అమ్మ మాట-అంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహణ



కొడిమ్యాల, జన సైన్యం న్యూస్

కొడిమ్యాల 10.వ అంగన్వాడి కేంద్రంలో "అమ్మ మాట--అంగన్వాడి బాట" కార్యక్రమాన్ని అంగన్వాడి టీచర్ గడ్డం విజయలక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు.అంగన్వాడి కేంద్రాల్లో ఆటపాటల ద్వారా ప్రాథమిక విద్యతో పాటు పోషకాహారం అందజేస్తామని తెలిపారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి నెల ఎత్తు, బరువును నమోదు చేసి పర్యవేక్షిస్తామని వివరించారు.అంగన్వాడి విద్య పిల్లల మానసిక, శారీరక వికాసానికి బలమైన పునాది అని విజయలక్ష్మి పేర్కొన్నారు.చిన్న వయస్సులోనే విద్యతో పాటు పోషకాహారం అందించడం ద్వారా పిల్లల్లో ఆరోగ్యకరమైన ఎదుగుదల సాధ్యమవుతుందన్నారు.ప్రతి తల్లి తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడి కేంద్రానికి పంపించి ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పిల్లల భవిష్యత్ అభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ విజయలక్ష్మి, ఆయా పద్మ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## శంకరపట్నం మండల నాయిబ్రాహ్మణ సేవాసంఘంఅధ్యక్షులుగా తిప్పబత్తిని నారాయణ ఎన్నిక

తేదీ 16/06/2026 మంగళవారం రోజున శంకరపట్నం మండల నాయిబ్రాహ్మణ సేవాసంఘం శంకరపట్నం లో జిల్లా అధ్యక్షులు నీలం మొండయ్య నాయి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడం జరిగినది. ఈ ఎన్నికల్లో తిప్పబత్తిని నారాయణ నాయి 30 ఓట్ల మెజార్టీతో అధ్యక్షులుగా గెలుపొందించారు. ప్రధాన కార్యదర్శిగా దుబ్బాక మహేష్ నాయి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికల కార్యక్రమంలో మండలాల్లోని అన్ని గ్రామాల సంగీయులు పాల్గొన్నారు.ఇట్టి ఎన్నికల సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల సంపత్ నాయి,జిల్లా గౌరవ అధ్యక్షులు ఔదుర్తి లక్ష్మణ్ కుమార్ నాయి,జిల్లా ఉపాధ్యక్షులు జంపాలభిక్షపతి నాయి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన శంకరం పట్నం మండల నాయి బ్రాహ్మణలకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

**జనసైన్యం సిటి**



## ప్రజల సమస్యల పరిష్కారానికి నేను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను



అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**జనసైన్యం సిటి**

మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక,అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినతి పత్రాలు పరిశీలించడమే కాకుండా బాధితుల సమస్యలను ఓపికగా విన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు,ఇందిరమ్మ ఇళ్లు,పింఛన్లు, తాగునీరు, రహదారులు, విద్యుత్, భూసంబంధ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు తమ ఫిర్యాదులను సమర్పించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచనలు చేశారు. కొన్ని అత్యవసర సమస్యల విషయంలో అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కాగా మరికొందరు ఆరోగ్య సమస్యలను డాక్టర్ కవ్వంపల్లి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా హాస్పిటల్ రిపోర్టులను పరిశీలించి వారి తగు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.

## 45వ డివిజన్‌లో సి.ఎస్.ఆర్ నిధులతో నూతన ఓపెన్ జిమ్ ప్రారంభం

**జనసైన్యం సిటి**



కరీంనగర్ నగరంలోని 45వ డివిజన్ మంకమ్మ తోట లో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఓపెన్ జిమ్'ను మేయర్ కొలగాని శ్రీనివాస్ మరియు బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ మరియు మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రారంభించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన 'ఫిట్ ఇండియా' నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారి ప్రత్యేక సహకారంతో, సీఎస్ఆర్ (CSR) నిధులను వెచ్చించి నగరంలో ఈ ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ-శ్రీనివాస్,బీజేపీ నాయకులు,కాలనీ వాసులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఆకాష్, బన్సల్ అకాడమీలను సీజ్ చేయాలి



**జనసైన్యం సిటి**

కరీంనగర్ నగరంలో అకాడమీల పేరుతో నిబంధనలకు అనుమతి లేకుండా ఇంటర్ అడ్మిషన్లు, తరగతులు నిర్వహిస్తున్న ఆకాష్ ,బన్సల్ అకాడమీలపై తనిఖీలు నిర్వహించి సీజ్ చేయాలని, అనుమతులేని ఆకాష్ బన్సల్ సంస్థలను సీజ్ చేయాలని, గ్రావిటీ, రేసోనేన్స్ ఐఐటీ నీట్ అకడమిల ఫీజుల దోపిడి అరికట్టాలని కోరుతూ ఈరోజు AISF అధ్వర్యంలో కరీంనగర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఏవో సుధాకర్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నూనావత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ... కరీంనగర్ నగరంలో ఆకాష్, బన్సల్, గ్రావిటీ, రేసోనేన్స్ సంస్థలు ఐఐటీ, నీట్ అకాడమీ అంటూ బయట బోర్డు పెట్టుకొని లోపల నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ అడ్మిషన్లు తరగతులు నిర్వహిస్తున్నారని, ఇంటర్మీడియట్ విద్యాధికారుల ఇష్టారాజ్యం వల్ల పలు కళాశాలల వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు, ఆకాష్,బన్సల్ అకాడమీ వారు ఇక్కడ ఇంటర్ అడ్మిషన్లు తీసుకొని వేరే కళాశాలల్లో ఇంటర్ పరీక్ష ఫీజు కట్టే యత్నం చేస్తున్నారని, గ్రావిటీ , రేసోనేన్స్ అకాడమీలో వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని నిబంధన పాటించకుండా ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్న ఆయా అకాడమీలపై తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ చేస్తే సీజ్ చేయాలని శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు అరుణ్, బోయినీ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సర్దార్ రవీందర్ సింగ్



**జనసైన్యం సిటి**

ఎన్నికలలో ఇచ్చిన హామీ కు కట్టుబడి 58వ డివిజన్ పద్మశాలి కులానికి చెందిన వెంగల్దాస్ రమాదేవి ఉమెన్ పోలీస్ కానిస్టేబుల్ కు అబ్బాయి పుట్టడంతో 5000/-రూపాయలు ఇవ్వడం జరిగినది. 58వ డివిజన్ ధోపివాడకు చెందిన నేరెళ్ల సంజయ్ నేరెళ్ల వనజ రజక కులస్తులు కు అబ్బాయి పుట్టడంతో 5000/-రూపాయలు ఇవ్వడం జరిగినది.. 58వ డివిజన్ రజక కులానికి చెందిన కొత్తకొండ అజయ్ కొత్తకొండ ప్రవళిక దంపతులకు అబ్బాయి పుట్టడంతో 5000/- ఇవ్వడం జరిగినది.
58వ డివిజన్ కు చెందిన మేర కులస్తులు మాడిశెట్టి మణిదీప్ మాడిశెట్టి లావణ్య కు అబ్బాయి పుట్టడంతో ఇచ్చిన మాట ప్రకారం గా 5000/- ఇవ్వడం జరిగినది.

## సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరెందర్ రెడ్డిని కలిసిన జిల్లా కురుమ సంఘం నాయకులు



**జనసైన్యం సిటి**

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని వారి స్వగృహంలో జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు కడారి అయిలన్న కురుమ ఆధ్వర్యములో కలిసి శాలువాతో సత్కరించిన జిల్లా కురుమ సంఘం నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షులు బీర్ల బీరయ్య కురుమ, రాష్ట్ర కార్యదర్శి ఎల్కపెల్లి లచ్చయ్య కురుమ, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రే రాజు కురుమ, జిల్లా సహాయ కార్యదర్శి మేకల నర్సయ్య కురుమ, కురుమ సంఘం ట్రస్ట్ అధ్యక్షులు చిగుర్ల శ్రీనివాస్ కురుమ, కురుమ విద్యా కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల వీరయ్య కురుమ, కర్రె రవి కురుమ, మీస రమాదేవి కురుమ, మీస మాధురి కురుమ తదితర సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఉచిత నేత్ర వైద్య శిబిరం



**జనసైన్యం సిటి**

బోయిని పల్లి మండలం మానువాడ గ్రామంలో ఈ రోజు ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో మనువాడ గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కట్ట గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి సమస్య వున్నా ప్రతి ఒక్కరు కూడా వినియోగించుకోవాలని మాట్లాడారు. గ్రామ ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షిస్తూ, సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కట్ట గోవర్ధన్ గౌడ్, ఉప సర్పంచ్ జీతేందర్, లక్ష్మణ్, శ్రీనివాస్, వైద్య సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన ఈవోగా డి.కిరణ్ బాధ్యతల స్వీకరణ

కొడిమ్యాల, జన సైన్యం న్యూస్.

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన కార్యనిర్వహణాధికారిగా డి. కిరణ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన మాజీ కార్యనిర్వహణాధికారి వి. అనూష, ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, రజనీకాంత్ చార్యులు, మనోజ్‌కుమార్ చార్యులు, సిబ్బంది కమలాకర్, రవి తదితరులు పాల్గొన్నారు. నూతన ఈవో డి. కిరణ్ బాధ్యతలు స్వీకరించడంతో ఆలయ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# యోగ: ఆరోగ్య మంత్రామా, అతిశయోక్తి ప్రచారమా?



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్



ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. భారతదేశం ప్రతిపాదనతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఇప్పుడు వందలాది దేశాలు మద్దతు ఇస్తున్నాయి. యోగా వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, ఒత్తిడి తగ్గుతుందని, దీర్ఘాయుష్షు లభిస్తుందని, అనేక రోగాలు దూరమవుతాయని ప్రభుత్వాలు, యోగా సంస్థలు, గురువులు ప్రచారం చేస్తున్నారు.

అయితే ఒక శాస్త్రీయ సమాజంలో ఏదైనా ఆరోగ్య ప్రయోజనం గురించి మాట్లాడేటప్పుడు ప్రశ్న ఒక్కటే: దానికి బలమైన వైద్యశాస్త్ర ఆధారాలు ఉన్నాయా?

ముందుగా ఒక విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. యోగా అనేది ఒకే విధానం కాదు. ఇందులో శారీరక భంగిమలు (ఆసనాలు), శ్వాస వ్యాయామాలు (ప్రాణాయామం), ధ్యానం, విశ్రాంతి పద్ధతులు వంటి అనేక అంశాలు ఉంటాయి. అందువల్ల "యోగ వల్ల అన్నీ నయమవుతాయి" అనడం ఎంత తప్పో, "యోగకు అసలు ప్రయోజనం లేదు" అనడం కూడా అంతే తప్పు.

గత రెండు దశాబ్దాల్లో అమెరికా, యూరప్, భారత్ సహా అనేక దేశాల్లో యోగాపై వేలాది పరిశోధనలు జరిగాయి. వాటిలో చాలా పరిశోధనలు యోగా వల్ల ఒత్తిడి, ఆందోళన, నిరాశ లక్షణాలు కొంత మేర తగ్గవచ్చని సూచించాయి. ధ్యానం, నియంత్రిత శ్వాస వల్ల నాడీ వ్యవస్థ ప్రశాంత స్థితిలోకి వెళ్లి గుండె వేగం, రక్తపోటు కొంత తగ్గే అవకాశం ఉందని పరిశోధనలు చూపించాయి. నిద్రలేమితో బాధపడేవారిలో కూడా కొంత మెరుగుదల కనిపించింది.

అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన పరిమితి ఉంది. ఈ పరిశోధనల్లో చాలా చిన్న స్థాయిలో జరిగాయి. అనేక అధ్యయనాల్లో పాల్గొన్న వారి సంఖ్య తక్కువగా ఉంది. కొన్నింటిలో సరైన నియంత్రణ సమూహాలు కూడా లేవు.

అందువల్ల యోగా వల్ల వచ్చిన ప్రయోజనాలు ఎంతవరకు యోగా కారణంగా వచ్చాయో, ఎంతవరకు సాధారణ వ్యాయామం, సామాజిక మద్దతు లేదా ప్లాసీబో ప్రభావం వల్ల వచ్చాయో నిర్ధారించడం కష్టం.

రోగనిరోధక శక్తి విషయంలో ప్రచారం మరింత అతిశయోక్తిగా ఉంటుంది. "యోగ చేస్తే ఇమ్యూనిటీ విపరీతంగా పెరుగుతుంది" అనే వాదనకు ప్రస్తుతం బలమైన శాస్త్రీయ ఆధారాలు లేవు. కొన్ని అధ్యయనాలు ఒత్తిడి హార్మోన్లు తగ్గడం వల్ల రోగనిరోధక వ్యవస్థ పనితీరులో స్వల్ప మెరుగుదల ఉండవచ్చని సూచించాయి. కానీ యోగా వల్ల వైరస్‌లు, బ్యాక్టీరియాలు దూరంగా ఉంటాయని లేదా తీవ్రమైన అంటువ్యాధులను నివారించవచ్చని చెప్పడానికి ఆధారాలు లేవు. కోవిడ్ మహమ్మారి సమయంలో కూడా యోగా ఉపయోగకరమైన సహాయక పద్ధతిగా ఉండవచ్చని మాత్రమే చెప్పబడింది; అది వ్యాక్సిన్‌కు లేదా వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని ప్రపంచ ఆరోగ్య నిపుణులు స్పష్టం చేశారు.

అలాగే మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్, కీళ్ల నొప్పులు వంటి వ్యాధుల విషయంలో కూడా యోగా సహాయక పాత్ర పోషించవచ్చు. ఉదాహరణకు మధుమేహ రోగి యోగా చేయడం వల్ల ఒత్తిడి తగ్గి, శారీరక చలనం పెరిగి, బరువు నియంత్రణలో ఉండవచ్చు. కానీ దానివల్ల ఇన్సులిన్ అవసరం పూర్తిగా పోతుందని లేదా మందులు మానేయవచ్చని చెప్పడం శాస్త్రీయంగా తప్పు. క్యాన్సర్ రోగులలో అలసట, ఆందోళన తగ్గించడంలో యోగా కొంత ఉపయోగకరంగా ఉండొచ్చు. కానీ క్యాన్సర్‌ను నయం చేసే చికిత్సగా యోగాను ప్రచారం చేయడం ప్రమాదకరం.

"ఎవరైనా యోగా చేయవచ్చు" అనే వాదన కూడా పూర్తిగా సరైనది కాదు. పిల్లలు, యువకులు, మధ్యవయస్కులు, వృద్ధులు అందరికీ ఒకే రకమైన యోగా సరిపోదు. వెన్నెముక సమస్యలు, మెడ నొప్పులు, గుండె జబ్బులు, అధిక రక్తపోటు, గర్భధారణ, కంటి గ్లాకోమా వంటి పరిస్థితుల్లో కొన్ని ఆసనాలు ప్రమాదకరంగా మారవచ్చు. ముఖ్యంగా సోషల్ మీడియా వీడియోలు చూసి కఠినమైన ఆసనాలను ప్రయత్నించడం వల్ల కండరాల గాయాలు, కీళ్ల దెబ్బలు, వెన్నెముక గాయాలు సంభవించిన ఉదాహరణలు ఉన్నాయి. కొన్ని వైద్య పత్రికల్లో యోగా సంబంధిత గాయాలపై నివేదికలు కూడా ప్రచురించబడ్డాయి.

ఇక్కడ ఒక సామాజిక సమస్య కూడా ఉంది. యోగా చుట్టూ కొన్ని సందర్భాల్లో శాస్త్రీయ చర్చ కంటే ఆధ్యాత్మిక లేదా జాతీయవాద ప్రచారం ఎక్కువగా కనిపిస్తుంది. ఆరోగ్య ప్రయోజనాలను అతిశయోక్తిగా చెప్పడం, విమర్శలను దేశద్రోహంగా చిత్రీకరించడం, ప్రతి రోగానికి యోగానే పరిష్కారం అన్న భావనను ప్రోత్సహించడం ప్రజారోగ్యానికి మేలు చేయదు. వైద్యశాస్త్రం అనేది ఆధారాలపై ఆధారపడాలి; విశ్వాసాలపై కాదు.

అయితే విమర్శనాత్మక దృక్పథం అంటే యోగాను పూర్తిగా తిరస్కరించడం కాదు. నడక, సైక్లింగ్, ఈత, సాధారణ వ్యాయామం ఎలా ఉపయోగకరమో, యోగా కూడా ఒక శారీరక-మానసిక ఆరోగ్య సాధనంగా ఉపయోగపడవచ్చు. ముఖ్యంగా వృద్ధులు, కీళ్ల సమస్యలున్నవారు, అధిక ఒత్తిడిలో ఉన్నవారు, ధ్యానం చేయాలనుకునేవారికి ఇది అనుకూలంగా ఉండవచ్చు. కానీ దీనిని వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయంగా కాకుండా అనుబంధ పద్ధతిగా చూడాలి.

చివరిగా...ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఇవ్వాల్సిన ముఖ్యమైన సందేశం ఇదే: యోగా ఒక మాయాజాలం కాదు, అదే సమయంలో నిరుపయోగమూ కాదు. దాని ప్రయోజనాలను శాస్త్రీయ ఆధారాల మేరకే అంగీకరించాలి. యోగా చేయాలనుకునేవారు తమ వయసు, ఆరోగ్య పరిస్థితి, వైద్యుల సలహా, శిక్షణ పొందిన బోధకుల మార్గదర్శకత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఆరోగ్యానికి నిజమైన మూలస్తంభాలు ఇప్పటికీ సమతుల ఆహారం, క్రమబద్ధమైన శారీరక వ్యాయామం, సరిపడ నిద్ర, టీకాలు, అవసరమైన వైద్య చికిత్సలే. యోగా వాటికి తోడ్పడే ఒక సాధనం మాత్రమే; వాటిని భర్తీ చేసే అద్భుత ఔషధం కాదు.

## క్రీడా ప్రతిభకు చిరునామా బ్లూ బెల్స్ హైస్కూల్



**జనసైన్యం సిటి**

కరీంనగర్ నగరంలోని హనుమాన్‌నగర్‌లో ఉన్న బ్లూ బెల్స్ హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్స్‌లో సీట్లు సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం ఆనందం వ్యక్తం చేసింది. పాఠశాలకు చెందిన జి. మోక్షిత్ కరీంనగర్ రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక కాగా, ఎం. వేదాన్ష్ హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అండ్ చైర్మన్ జంగ సునీత మనోహర్ రెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి, వారి భవిష్యత్ విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అండ్ చైర్మన్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యా రంగంతో పాటు క్రీడా రంగంలోనూ రాణిస్తూ తమ ప్రతిభను చాటుకోవడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

విద్యార్థుల ఈ విజయాల వెనుక ఉన్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు క్రీడా శిక్షకుల కృషిని చైర్మన్ ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని విజేతలను అభినందించారు.

## గునుకుల కొండాపూర్‌లో పిచ్చికుక్కల స్వైర్య విహారం



**జనసైన్యం సిటి**

గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామంలో నిన్నటి రోజున పిచ్చికుక్కలు గ్రామానికి చెందిన గుండ పర్శరాములు, ఊట్ల పోచమ్మ లను దాడి చేసి తీవ్రంగా గాయపరినందున ఇంట్లో చికిత్స పొందుతున్న పరశురాం గౌడ్ ను ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి స్థానిక సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ, ఉప సర్పంచ్ న్యాలపట్ల రమేష్, మరియు పాలకవర్గ సిబ్బందితో పరామర్శ చేయడం జరిగింది. సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ మాట్లాడుతూ కుక్కల బెడద తీవ్రస్థాయిలో ఉన్నందున వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని, వృద్ధులు చిన్న పిల్లలు బయట తిరిగే పరిస్థితి లేదని, రోడ్లపై నడవాలంటేనే భయంగా ఉందని ఆయన ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీఓ గారు స్పందిస్తూ నివారణ చర్యలు చేపట్టుటకు పై అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సురేందర్, పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఫీల్డ్ అసిస్టెంట్ హనుమాన్ల యాదగిరి , కారోబార్ ముల్కల అంజయ్య, వార్డు సభ్యులు చొక్కాల్లా లక్ష్మయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బాలల స్నేహపూర్వక మండలంగా తిమ్మాపూర్‌ను తీర్చిదిద్దుదాం



**జనసైన్యం సిటి**

బాలల స్నేహపూర్వక మండలంగా తిమ్మాపూర్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ముందడుగు వేస్తున్నాయి. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలో డిఆర్డిఏ ఆధ్వర్యంలో 'స్నేహ కిషోర్ బాలికల సంఘాల'కు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో బాలికలకు సమాజంలో ఎదురయ్యే పలు అంశాలపై కులంకషంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా మిషన్ వాత్సల్య, చైల్డ్ హెల్ప్ లైన్ సేవలు, ఆపదలో ఉన్న పిల్లలను ఆదుకునేందుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవల గురించి వివరించారు. బాల్య వివాహాల నిరోధం, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి వల్ల బాలికల భవిష్యత్తు ఎలా దెబ్బతింటుందనే విషయాలను నొక్కి చెప్పారు. ఆరోగ్యం – జీవన నైపుణ్యాలు: సమాజంలో ఏర్పడే రుగ్మతలను ఎలా ఎదుర్కోవాలో తెల్పుతూ.. జీవన నైపుణ్యాలు, న్యూట్రిషన్ (ఆహార సమతుల్యత), హెల్త్ అండ్ శానిటేషన్, మరియు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం సంపత్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మ, మిషన్ వాత్సల్య ప్రతినిధి సాదినేని రమేష్, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది సుందరగిరి సాయికిరణ్ గౌడ్, ఎడ్ల ప్రియాంకలతో పాటు హెల్త్ సిబ్బంది, మహిళా సంఘాల వివోఏలు పెద్ద సంఖ్యలో కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యమే ప్రజారోగ్యానికి పునాది




**జనసైన్యం సిటి**

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో నగర పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా నిర్వహిస్తున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ 29, 13, 38, 39 డివిజన్లలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో మురికి కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగింపు పనులను మేయర్ స్వయంగా పరిశీలించి, పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలువల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. మేయర్ మాట్లాడుతూ, నగర ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం నగర పాలక సంస్థ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు సోమిడి వేణు, తెల్ల లక్ష్మి రమేష్, మాసం గణేష్, దేవసాని సరస్వతి సత్యనారాయణ, మున్సిపల్ అధికారులు, శానిటేషన్ వర్కర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తొలి బోటనీ విభాగ పీహెచ్.డీ పరిశోధన మార్గదర్శిగా తిరుకోవెల శ్రీనివాస్




ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వయంప్రతిపత్తి), కరీంనగర్ బోటనీ విభాగాధిపతి మరియు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ తిరుకోవెల శ్రీనివాస్ మరో విశిష్ట ఘనతను సాధించారు. ఆయన మార్గదర్శకత్వంలో తొలి పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థి శ్రీ యం.రాజశేఖర్ తన డాక్టరేట్ పరిశోధన నిమిత్తము రీసెర్చ్ స్కాలర్ గా జాయిన్ కావడం కళాశాలకు గర్వకారణమైంది. బోటనీ విభాగంలో రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల పరిధిలో తొలి పీహెచ్‌డీ పరిశోధన మార్గదర్శిగా ప్రొఫెసర్ తిరుకోవెల శ్రీనివాస్ గారు చరిత్ర సృష్టించడం విశేషం. ఆయన శాస్త్రీయ దృక్పథం, పరిశోధన పట్ల అంకితభావం, విద్యార్థుల అభివృద్ధికి నిరంతర కృషి ఫలితంగానే ఈ అరుదైన ఘనత సాధ్యమైందని సహచర అధ్యాపకులు పేర్కొన్నారు. పరిశోధన రంగంలో కళాశాల ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో ప్రొఫెసర్ శ్రీనివాస్ గారి పాత్ర ప్రశంసనీయమని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు మరియు విద్యార్థులు హృదయపూర్వకంగా అభినందించారు. ఈ ఘనత బోటనీ విభాగానికే కాకుండా మొత్తం కళాశాల వ్యవస్థకు గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని పరిశోధకులను తయారు చేసి ఉన్నత విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రౌతు రాధాకృష్ణ, డాక్టర్ పడాల తిరుపతి, డాక్టర్ మహబూబ్ మహమ్మద్ హుస్సేన్, శ్రీమతి కే కళాజ్యోతి, డాక్టర్ బుంగ తిరుపతి, మహమ్మద్ తాజుద్దీన్, మతి స్వరూప రాణి పాల్గొన్నారు.

## బహుజన్ సమాజ్ పార్టీ అదిలాబాద్ జోన్ -1 ఇంచార్జ్‌లుగా కల్లెపెల్లి రాజేందర్ , పల్లె ప్రశాంత్ గౌడ్

**జనసైన్యం సిటి**






బహుజన్ సమాజ్ పార్టీ లో సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడు కల్లెపెల్లి రాజేందర్ ని అదిలాబాద్ జోన్ -1 ఇంచార్జ్ గా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ ప్రకటించారు అతనితో పాటు మరోక ఇంచార్జ్ గా పల్లె ప్రశాంత్ గౌడ్ ని ప్రకటించారు. అదేవిధంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్ లు గా దొడ్డే శ్రీనివాస్ బోయిని బాబు లను ప్రకటించారు. నిన్న రాష్ట్ర కార్యాలయం లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఎస్పీ ఛీఫ్ సెక్టార్ కో ఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్సీ అతర్ సింగ్ రావు సురేష్ ఆర్య ల ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఈ పదవి భాధ్యత లు ఇచ్చారు. అదిలాబాద్ జోన్ పరిది లో నాలుగు పార్లమెంటు స్థానాలు ఉన్నాయి ఇరవై ఎనమిది అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి . రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు ఆదేశించారు. కల్లెపెల్లి రాజేందర్ చొప్పదండి అసెంబ్లీ రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన వ్యక్తి . పూలే అంబేడ్కర్ సిద్ధాంతాలకు ప్రభావితుడై గత 30 సంవత్సరాలుగా బీఎస్పీ లో పని చేస్తున్నారు. ఆయన సీనియారిటీ సిన్సియారిటీ నిబద్ధత ను పార్టీ పరిగణలోకి తీసుకొని ఈ బాధ్యతలు ఆయనకు ఇచ్చారు.

ఒబిసి సమీకరణ లో భాగంగా పల్లె ప్రశాంత్ గౌడ్ కి అవకాశం ఇచ్చారు. ఈయన గత శాసన సభ ఎన్నికల్లో హుజురాబాద్ నుండి పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. పార్లమెంటు ఇంచార్జ్ లు గా నియమితులైన దొడ్డే శ్రీనివాస్ జమ్మికుంట మండలం పెద్దంపెల్లి మాజీ సర్పంచ్ గా పని చేశారు. పార్టీ లో సగం పదవులు యువత కి ఇవ్వాలని జాతీయ అధ్యక్షురాలు బెహన్ జీ గారీ ఆదేశాల ప్రకారం వీరికి ఈ పదవులు దక్కాయి. ఈ నియామకం కి సహకరించిన బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం రాష్ట్ర కార్యవర్గ సబ్యులు మాతంగి అశోక్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## రన్నింగ్ కాలమ్



అరగంట పాటు సైక్లింగ్
అందిస్తుందట ఆరోగ్యం
ఆనందానికి ఇంకేముంది
అంతకుమించి సౌభాగ్యం

సాఫీగా లైఫ్ సాగాలంటే
తొక్కడం మంచిది సైకిల్
తర్వాత తేడా చూడండి
జీవితమే ఔనొక మిరకిల్

-పెనుగొండ బసవేశ్వర్..

## గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభానికి ముమ్మర ఏర్పాట్లు



జనసైన్యం సిటి

గంగాధర మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తరగతులు నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రస్తుతానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంపై అదనపు తరగతి గదులను నిర్మించాలని నిర్ణయించారు. ఈ విషయమై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్‌తో ఫోన్ లో మాట్లాడారు. తక్షణమే గదుల నిర్మాణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం, డిగ్రీ కళాశాల శాశ్వత భవన నిర్మాణం కొరకు మండల పరిధిలోని మధురానగర్‌లో అనువైన స్థలాన్ని ఎమ్మెల్యే అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగాధర ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, కళాశాల భవన నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దమ్మని రాము,ఎమ్మార్వో అంబటి రజిత,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి మహేందర్,మధురానగర్ సర్పంచ్ వేముల భాస్కర్,కాంగ్రెస్ నాయకులు అట్ల శేఖర్ రెడ్డి,పెంచాల చందు,దాతు అంజి,మేర్గ కొండయ్య,బైరిశెట్టి సంపత్ ,గుండవేని తిరుపతి పాల్గొన్నారు.

## 54వ డివిజన్‌లో ఘనంగా 'బడిబాట' కార్యక్రమం



జనసైన్యం సిటి

కరీంనగర్ నగరంలోని 54వ డివిజన్ పరిధిలో గల అంగన్‌వాడీ స్కూల్‌లో మంగళవారం 'బడిబాట' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ప్రభుత్వ బడులలో చేరికలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ జి. ఉమారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో మేలు చేస్తాయని, ఇక్కడ అందించే పౌష్టికాహారం, ప్రాథమిక విద్య పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని అన్నారు. అర్హులైన పిల్లలందరినీ తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి, ఆయా, మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. బడిబాటలో భాగంగా చిన్నారులకు అంగన్‌వాడీ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు.

## భవాని శంకరాలయం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌కు ఆహ్వానం



**జనసైన్యం సిటి**

టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీ దారం శ్రీనివాస్ రెడ్డి కార్యదర్శి సంగేం లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో నేడు పలు మర్యాదపూర్వక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

ఈ సందర్భంగా కరీంనగర్ భగత్‌నగర్‌లోని టీఎన్జీవోల కాలనీలో నిర్మితమైన శ్రీ భవాని శంకరాలయం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి గౌరవ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా గారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఆలయ విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను జిల్లా కలెక్టర్ కి అందజేసి, కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కరీంనగర్ ఆర్డీవో శ్రీమతి షర్మిల ని ఆర్డీవో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

అలాగే నూతనంగా జిల్లా రెవెన్యూ అధికారిగా (డీఆర్ఓ) బాధ్యతలు చేపట్టిన శ్రీ కె. స్వామి గారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ జిల్లాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమాలలో టీఎన్జీవోల జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి కార్యదర్శి సంఘం లక్ష్మణరావు కేంద్ర సంఘం నాయకులు రాగి శ్రీనివాస్ గూడ ప్రభాకర్ రెడ్డి గంగారపు రమేష్ గౌడ్ జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్ కార్యదర్శి వెలిచాల సుమంతరావు రూరల్ అధ్యక్షులు వాస్తవిక్ గౌడ్ కార్యదర్శి కొమ్మర శ్రీనివాస్ రెడ్డి మహిళా నాయకులు శారద సునీత శైలజ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కోట రామస్వామి కార్యదర్శి శంకర్ సంఘం నాయకులు కరుణాకర్ లవ కుమార్ నారాయణ శ్రీనివాస్ అన్నాడి శ్రీనివాస్ రెడ్డి రవీందర్ మరియు ఆలయ కమిటీ ప్రతినిధులు రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇరవైఏడవ సారీ రక్తదానం చేసిన బీఎస్పీ నేత నిషాని

**జనసైన్యం సిటి**



చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కరీంనగర్ లోని చెల్మెడ ఆనంద రావు వైద్య కళాశాలలో శస్త్ర చికిత్స కి రక్తం అవసరముండగా బహుజన్ సమాజ్ పార్టీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం వెళ్లి బి పాజిటివ్ రక్తం దానం చేశారు. ఈ రోజు తో ఆయన ఇరవై ఏడవ సారీ చేసినారు. 2006 నుండి క్రమం తప్పకుండా ఇస్తున్నాడు. 2009 లో వారి తల్లి తండ్రి కి రోడ్ ప్రమాదంలో గాయపడి అధిక రక్తస్రావం జరుగి తల్లి మరణించింది. అప్పటి నుండి ఎవరు కూడ రక్తం లభించక మరణించవద్దని నిషాని రామచంద్రం క్రమం తప్పకుండా రక్తదానం చేస్తున్నారు. ఇలా క్రమం తప్పకుండా చేయడం వలన పలువురు ఆదర్శం గా తీసుకుంటారని అంటున్నారు.

## ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బిగితే (ఐపిఎస్) ఆకస్మీకంగా తనిఖీ



**జనసైన్యం సిటి**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో. పోలీసు స్టేషన్ లోని రికార్డులను, నేర చరిత్ర కలిగిన వారి వివరాలను రాజన్న సిరిసిల్ల జిల్లా ంజూ మహేశ్ బి గీతే పరిశీలించారు అనంతరం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న వివిధ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి మత్తుకు యువత బానిసకావద్దని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తు పట్టుబడితే చర్యలు తప్పవన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వద్దని, ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట సిరిసిల్ల రూరల్ సిఐ నాగేశ్వర్ రావు, ఎస్ ఐ సిరిసిల్ల అశోక్ , సిబ్బంది ఉన్నారు.

## హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు

**జనసైన్యం సిటి**



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వానికి తిరుగుబాటు తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండలోని గుండ్లసింగారం భూపోరాట కేంద్రంలో మంగళవారం సురవరం సుధాకర్ రెడ్డి నగర్ పేరుతో నిర్మించిన సిపిఐ కార్యాలయాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని చెప్పి నేడు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఇండ్లు లేని నిరుపేదలు ఉన్నారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినా పేదవాడి జీవితం మార లేదని అన్నారు. పేదలు సిపిఐ ఆధ్వర్యంలో అనేక చోట్ల భూపోరాటాలు నిర్వహించి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని అన్నారు. పాలకులు పేదల అనుకూల విధానాలను అవలంబించడం లేదని, ప్రధాని నరేంద్ర మోదీ బంగారం కొన వద్దంటూ పేదలకు నీతులు చెబుతూ పెద్దలకు అనుకూలంగా మెదులుతున్నారని విమర్శించారు. కమ్యూనిస్టుల మద్దతు ఉంటేనే ప్రభుత్వాలు మనగలుగుతాయని అన్నారు. కమ్యూనిస్టులు లేకుంటే తెలంగాణాకే విముక్తి జరిగేది కాదని అన్నారు. గుండ్ల సింగారంలో ఎంతో దీక్ష, పట్టుదలతో కాలనీ నిర్మించుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారని, కాలనీలో నివసిస్తున్న పేదలందరికీ ఇండ్ల పట్టాలు వచ్చేలా తాను అధికారులతో, స్థానిక ఎమ్మెల్యేతో అవసరం అయితే సీఎంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గుడిసెవాసులకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కాలనీలో కరెంట్, తాగునీరు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, వలీ ఉల్లాఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, మాలోత్ శంకర్, శనిగరపు రాజు కుమార్, కొట్టే వెంకటేష్, వేల్పుల సారంగపాణి, అనుకారి అశోక్, రాసమల్ల దినా, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, గ్రామ పెద్దలు మాదాసి కళ్యాణ్, గాదె రాజన్న, కట్కూరి కృష్ణ, జన్ను కృష్ణ, నాయకులు పోనుగోటి రాము గోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, కొడెపాక బాబు, మామునూరి దామోదర్, గుడికందుల శివ, పూజారి నరేందర్, కేతపాక ప్రసాద్, తాటికొండ ప్రశాంత్, మాలోత్ మంగ, బైసా మౌనిక, నలువాల సంధ్య, తాటికంటి మమత, గుంటి రజిత, వందలాది ఇండ్ల వాసులు తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి నాయకులు గడ్డం రాజనర్సు, రోంటాల శ్యామ్, కేతపాక ప్రసాద్, తాటికంటి మమత, ప్రముఖ సినీ గాయకుడు ఇమ్మడి అశోక్ పాటలు, మహిళల కోలాట నృత్యం ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.




## కొత్తపల్లి మండలంలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి



**జనసైన్యం సిటి**

కరీంనగర్ జిల్లా పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వలపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గారి ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా తీవ్రం చేశారు. ఇందులో భాగంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ వాసాల సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా కొత్తపల్లి మండలం రాములపల్లి గ్రామ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా నిల్వ ఉంచిన ఒక భారీ అక్రమ ఇసుక డంప్‌ను పోలీసులు కనుగొని, సీజ్ చేశారు.

స్వాధీనం చేసుకున్న వివరాలు: సీజ్ చేసిన ఈ పెద్ద ఇసుక డంప్‌లో సుమారు 50కు పైగా ట్రాక్టర్ల లోడుల అక్రమ ఇసుక నిల్వలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న మొత్తం ఇసుక నిల్వలను తదుపరి చట్టపరమైన చర్యలు మరియు సమగ్ర విచారణ నిమిత్తం సంబంధిత పరిధిలోని కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

సీపీ హెచ్చరిక: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా సహజ వనరులైన ఇసుకను అక్రమంగా తవ్వినా, నిల్వ ఉంచినా, రవాణా చేసినా కఠిన చర్యలు ఉంటాయని సీపీ గౌష్ ఆలం ఈ సందర్భంగా హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాపై నిరంతరం నిఘా ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు మైనింగ్ చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

## సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**జనసైన్యం సిటి**

కరీంనగర్ నగరంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ అశ్విని తానాజీ వాకడే సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పాఠశాలలో చేపట్టిన సన్నద్ధత కార్యక్రమాలను పరిశీలించిన ఆమె, తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజన వంటగది, పాఠశాల ప్రాంగణం, మంచినీటి ట్యాంకులు, ఆట స్థలం తదితర మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన డాక్టర్ అశ్విని తానాజీ వాకడే విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలిస్తూ రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్ నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు చక్కటి చేతిరాత అలవాటు చేయడంతో పాటు వివిధ సబ్జెక్టుల్లో ప్రాథమిక భావనలపై బలోపేతమైన శిక్షణ అందించాలని ఆదేశించారు. సాంఘిక శాస్త్రంలో భాగంగా రాష్ట్రాలు రాజధానులు, ప్రధాన నదులు, భారతదేశం మరియు తెలంగాణ రాష్ట్ర పటాలను విద్యార్థులతో గీయించి వారి అవగాహనను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, ఇతర అవసరాలపై వివరాలను తెలియజేయాలని ప్రధానోపాధ్యాయులను ఆమె కోరారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠ్యపుస్తకాల పంపిణీ, పాఠశాల సన్నద్ధత కార్యక్రమాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, మరిన్ని మెరుగుదలల కోసం పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి, సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆందోళనల అదుపుకు యోగా అత్యుత్తమ ఔషధం



జూన్ 21న జగమంతా
యోగతో ఒక్కటౌతుంది
భారతీయ యోగ విద్యను
గుండెలకు హత్తుకుంటుంది
ప్రపంచ దేశాలు ఒకే
బాటలో నడుస్తాయి
విశ్వ మానవాళి ఆరోగ్యానికి
సాధనమైన యోగ విజ్ఞానాన్ని
అందించిన భారత్ కు
ప్రపంచ దేశాలు జోహార్లు
పలుకుతున్నాయి
ఉరుకుల పరుగుల జీవితంలో
అలసిన మనసుకు స్వాంతన
ఇచ్చే యోగ ఆరోగ్య ప్రధాతగా
పాశ్చాత్య దేశాల్లో గుర్తింపు పొందింది
యోగా ఆందోళన సుడిగుండంలో
చిక్కుకున్న అన్ని వయసుల
వారికి ఆత్మీయ నేస్తమై
మనోప్రశాంతతకు మార్గదర్శి అయింది
యోగతో కంగారు జీవితానికి
పలకాలి స్వస్తి యోగ సాధన
నీజీవన శైలి అవుతే మనసు
కలవరపడదు కలతలు లేని
కుటుంబాలు ఏర్పడి
మానసిక ఉద్రిక్తతలు తగ్గుతాయి
ప్రశాంతతను పెంచే యోగ
వైపు అడుగులు వేయు
శ్వాసపై ధ్యాస ఉంచి చేసే
ప్రాణాయామం మనసులోని
ఆందోళన కరిగించే అమృతం
ఆసనాల సాధనతో దేహానికి
లభించును దృఢత్వం
ధ్యానంతో చేకూరును
ఆత్మస్థైర్యం దైవత్వం
ఆలోచన సునామీని
ఆపే శక్తే యోగం
మనసును కమ్మిన
మబ్బులను తొలిగించి
మానసిక చైతన్యాన్నిపెంచే
ఆయుధం యోగాస్త్రం
మనసులో నిరంతరం ఉప్పొంగే
ఆలోచనలు ఉద్రేకాలు కోరికలు
భయాలు ద్వేషాలు అహంకారం
వాటిని అర్థం చేసుకొని
నియంత్రించేది యోగ
యోగ కేవలం శారీరక
వ్యాయామం కాదు
వ్యక్తిని లోపలి నుండి
సంస్కరించి
సమాజంలో సమరసత
సమన్వయాన్ని పెంచే
అద్భుతమైన విజ్ఞానం
వ్యక్తిని సమాజంతో సమాజాన్ని
మానవత్వంతో మానవత్వాన్ని
విశ్వ చైతన్యంతో అనుసందానించే
మార్గం యోగ
ఒత్తిడిని తరిమికొట్టే
అత్యుత్తమ ఔషధం యోగ
అంతరంగ శాంతిని
మేల్కొలిపే సాధనం యోగ
నిత్య జీవితాన్ని నందనవనం
చేసే మంత్రం యోగ
మనిషి మనసులోని ద్వేషాన్ని
ప్రేమగా అహంకారాన్ని వినయంగా
అసూయను ఆనందంగా
భయాన్ని ధైర్యంగా మార్చగల శక్తి
యోగా సాధనలోనే ఉంది
యోగం ఒక ఆంతరంగిక శాస్త్రం
సాధారణ వ్యక్తిని అసాధారణ
వ్యక్తిగా తీర్చిదిద్దే మనో విజ్ఞానం
సమాజాలను మార్చాలంటే
ముందుగా మనసి చిత్తాలను మార్చాలి
యోగ అలవాటైతే రోగాలు ధరి చేరవు
సూర్య నమస్కారాలతో
పొద్దున లేవాలి
శరీరంలో కొత్త శక్తిని నింపాలి
కళ్ళు మూసి కాసేపు
ధ్యానంలో కూర్చుంటే
కష్టాలన్నీ కరిగిపోతాయి
యోగకు కులం లేదు
మతం లేదు యోగా అందరిది
యోగ ఆరోగ్యకరమైన
సమాజాన్ని నిర్మిస్తుంది
మన దేశ యోగా జ్ఞనాన్ని
ప్రపంచమంతా చాటుదాం
అంతర్జాతీయ యోగా దినాన్ని
ఘనంగా జరుపుకుందాం
రోజు కొంత సమయం యోగ
కొరకు కెటాయిద్దాం
ఆందోళన రహిత జీవితంతో
ఆనందంగా జీవిద్దాం

నేదునూరి కనకయ్య

# విద్యార్థుల రవాణా వాహనాలపై ప్రత్యేక తనిఖీ డ్రైవ్




**జనసైన్యం సిటి**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పాఠశాల విద్యార్థుల రవాణా వాహనాల భద్రతపై పోలీస్ మరియు రోడ్డు రవాణా శాఖ (R T A) అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రవాణాలో నిమగ్నమైన వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలు మరియు మోటారు వాహన చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ తనిఖీలలో భాగంగా, ఫిట్‌నెస్ లేని 17 స్కూల్ బస్సులు మరియు 50 ఆటోలను సీజ్ చేయడం జరిగింది. అలాగే, సరైన పత్రాలు (రిజిస్ట్రేషన్, పర్మిట్, ఇన్సూరెన్స్) లేని 64 వాహనాలపై, యూనిఫాం ధరించని 13 మంది డ్రైవర్లపై, నంబర్ ప్లేట్ లేని వాహనం మరియు ఓవర్‌లోడింగ్‌తో నడుపుతున్న 9 వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకున్నాము. మొత్తంగా 87 వాహనాలపై ఉల్లంఘనలు నమోదు చేశాము."ప్రతి చిన్నారి భద్రత మనందరి బాధ్యత. పాఠశాల వాహనాల డ్రైవర్లు నిబంధనలను అతిక్రమిస్తే సహించేది లేదు. వాహనాలకు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ మరియు ఇతర పత్రాలు ఉండాలి. వేగ నియంత్రణ పాటిస్తూ, మొబైల్ ఫోన్ వినియోగం లేదా మద్యం సేవించి వాహనాలు నడపడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాము," అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీలు యాదగిరిస్వామి, వెంకటస్వామి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి కవిత, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అంజయ్య ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# భూసార "పునరుద్ధరణ" తో మానవ మనుగడ

## (జూన్17 న ప్రపంచ ఎడారీకరణ కరువు దినోత్సవం సందర్భంగా)



నేదునూరి కనకయ్య

నేలల తీరుతెన్నులే ప్రపంచ ఆహార భద్రత ను నిర్ణయిస్తాయి. భూమి లోని సహజ పోషకాలు వ్యవసాయానికి ఆవరణ వ్యవస్థకు ఉపయోగపడుతాయి. భూసారం సకల జీవ జాతులకు ఆహారం ఆవాసాన్ని అందించి మానవ నాగరికతకు పునాదిగా నిలుస్తుంది.

### భూమి ప్రకృతి ప్రసాదితం

భూమిని పెంచలేము ఉన్న భూమిని సశీరక్షించుకుంటేనే ఆర్థిక వ్యవస్థలో సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుంది.

ఎడారీకరణ వ్యవసాయ యోగ్యమైన భూమి సారాన్ని కోల్పోవడమే ఎధారీకరణ అంటారు.

ఎడారులు వేరు ఎడారీకరణ వేరు భూ క్షీణతకు మరొక రూపమే ఎడారీకరణ .మానవుని చర్యలు వాతావరణం మార్పులు కారణంగా భూమి ఉత్పాదక సామర్థ్యం తగ్గిపోవడాన్ని ఎడారీకరణగా భావిస్తారు. భూమి మనుషులకే కాక



సకల జీవ జాతులకు ఆహారాన్ని ఆవాసాన్ని అందించే ఏర్పాటు ప్రకృతి చేసింది.కాలుష్యం అడవుల నరికివేత యుద్ధాలు లాంటివి ఎడారీకరణ కు దారి తీస్తున్నాయి. ఎడారీకరణ వలన భూమి నిస్సారంగా మారుతుంది. ఆహార కొరతనీటికొరతఏర్పడుతుంది.

ఆర్థిక వ్యవస్థలో వలసలు పేదరికం' నిరుద్యోగం పెరుగుతుంది.

### 2026 సం" థీమ్

ప్రపంచ ఎడారీకరణ మరియు కరువు నివారణ దినోత్సవం యొక్క ఇతివృత్తం పచ్చిక బయళ్ళు (మేత భూములు) గుర్తించండి గౌరవించండి పునరుద్ధరించండి. అనే నినాదంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు .

2026 సం" ప్రపంచ స్థాయి అధికారిక వేడుకలకు కెన్యా దేశం ఆతిథ్యం ఇస్తుంది. దాదాపు ఒక దశాబ్దం తర్వాత ఆఫ్రికా ఖండంలో ఈ వేదికలు జరగడం ప్రథమం.

### ఈ ఏడు థీమ్ ప్రకారం

పచ్చిక బయల్లను పర్యావరణ వ్యవస్థను రక్షించడం .భూమి క్షీణతను( కోతను) నివారించడం . పశువుల పెంపకం దారుల జీవనోపాధికి మద్దతు ఇవ్వడంపై దృష్టి పెడుతుంది.

### పర్యావరణ వేత్తలు ఆందోళన

భూమిపై జనాభా రోజురోజుకు పెరుగుతోంది .పెరుగుతున్న జనం అవసరాలు తీర్చడానికి ప్రకృతి ప్రసాదించిన నిర్మిత భూ భాగంలోనే అధిక ఉత్పత్తి చేపట్టాలి .దీనికోసం భూమి శాస్త్రీయ పరిశోధనలు ఫలితాలు ఉపయోగించి అధిక దిగిబడుల కోసం రసాయనిక ఎరువులు క్రిమి సంహారక మందులు జలవనరుల వినియోగం ప్రకృతి భరించలేని స్థాయిలో పెంచుకుంటు పోతున్నాం. 2014 సంవత్సరంలో150 కోట్ల హెక్టార్ల అటవీ భూములను చిత్తడి నేలలను పంట భూములుగా మార్చివేశాం 2050 సంవత్సరం నాటి కి భూవిస్తీర్ణం 10 శాతం వరకు పడిపోతుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూమి నిర్జీవమై ఎడారిగా మారుతుంది అడవులను చిత్తడి నేలను తోటలుగా' వ్యవసాయ భూములుగా మార్చడం వలన పొలాలు క్రమంగా భూసారాన్ని జీవాన్ని కోల్పోయి వ్యవసాయానికి పనికి రాకుండా పోతున్నాయి. పంటలు నిర్జీవమై భూమి ఎడారిగా మారి పోతుంది.

### ఎడారీకరణ కారణాలు

జల వనరుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం. జీవ భౌతిక 'ఆర్థిక పరిస్థితులు అనుకూలించక పోవడం వలన భూమి ఉత్పాదకత తగ్గి ఎడారీకరణ సంభవిస్తుంది. కరువులు వరదలు:ప్రకృతి విపత్తులు కూడా సహజవనరుల క్రమ క్షయానికి కారణమై నేలలను నిస్సారంగా మార్చి వేస్తున్నాయి. రసాయనిక ఎరువులు పురుగు మందుల వినియోగం విస్తృతం కావడం వల్ల నేలను గుల్ల పరుస్తున్నాయి. సహజంగా భూసారాన్ని పెంచే వాన పాములు తేనే టీగలు వంటి పంట సహాయ కారులు చనిపోతున్నాయి.వరదల సమయంలో భూమి పై సారవంతమైన మట్టి కొట్టుకుపోవడం చేత ఎడారీకరణ పెరుగుతుంది.

పట్టణీకరణ పారిశ్రామికీకరణ

నేడు ప్రపంచ వ్యాప్తంగా పట్టణీకరణ 'పారిశ్రామికీకరణ వేగంగా పెరుగుతుంది.

ఇది భూమి క్షీణతకు దోహధపడుతుంది.భూమి క్రమంగా ఎడారిగా మారుతుందని భూతాపం పెరిగి భూమి ఉత్పాదక సామర్థ్యం దెబ్బతిని కరువు' కాటకాలు ఆకలి'చావులు సంభవిస్తున్నాయని పలు సామాజిక ఆర్థిక అద్యయనాలు వెల్లడిస్తున్నాయి.

### ఎడారీకరణ ప్రపంచ దేశాలకు సమస్య

ఎడారీకరణ సమస్య ప్రపంచ దేశాలకు పెద్ధ సవాల్ గా పరిణమించింది. మానవుని స్వార్ధ పూరిత చర్యలు తప్పిదాలు ప్రకృతి 'వాతావరణ మార్పులు ప్రకృతి విపత్తుల వల్ల భూమి ఉత్పాదకత తగ్గి ఎడారీకరణ పెరిగే ప్రమాదం వుంది. ఈ పరిస్తితి ఇలాగే కొనసాగితే విపత్కర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని 'ఐ'రా'స హెచ్చరించింది.

యూ' ఎన్:సీ'సీ'డీ అంచనాలు

### ఐ'రా'సకు చెందిన యూ'ఎన్ససి:సీ'డీ

అంచనాల ప్రకారం వ్యవసాయానికి అనుకూలంగా లేని భూములను వ్యవసాయం కొరకు వినియోగించడం నేల' నీరు ' సంరక్షణ చర్యలు ఆశించనంతగ లేక పోవడం పరిమితికి మించి సాగు చేయడం నీటి యాజమాన్యం సక్రమంగా లేకపోవడం భూగర్భ జలాల అపరిమిత వినియోగం ఏడారీకరణకు కారణాలని పేర్కొంది.

### భూమి క్షీణత ఐ'రా'స నివేదిక

ఏటా 530 కోట్ల టన్నుల సారవంతమైన మట్టి 80లక్షలు టన్నుల వృక్ష పోషకాలు నేల కోల్పోతుంది . భూక్షీణత వల్ల 25 కోట్లమంది ప్రభావిత మౌతున్నారు. ప్రతి యేటా 12 మిలియిన్ హెక్టార్ల భూమిని కోల్పోతున్నాం ప్రపంచ అటవీ విస్తర్ణం 13 మిలియ హెక్టార్ల భూమిని క్షీణిస్తుంది అని ఐ:రాస' నివేదికలో పేర్కొంది.ఈ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా 1.5 బిలియన్ ప్రజలను ప్రభావితం చేస్తుంది. ప్రపంచం లో వ్యవసాయం కోసం ఉపయోగించే పొడి భూముల్లో 70 శాతం వివిధ కారణాలతో అంతరించి పోతున్నాయి. ఆఫ్రికా ఖండంలో భూమి ఎడారిగా మారడం వల్ల గత 5 ఏళ్ల లో 60 మిలియన్ల మంది ప్రజలు వలస వెల్లుతున్నారు.

భారత దేశం భూమి క్షీణత

భారత దేశం భౌగోళిక ప్రాంతం 328 మిలియన్ల హెక్టార్ల లో దాదాపు 97.85మిలియను హెక్టార్ల(29.7 శాతం) భూమి ?క్షీణతకు గురైంది.

రాష్ట్రాలలో కేంద్ర పాలిత ప్రాంతాలలో 28 రాష్ట్రాలలో భూమి ఎడారీకరణ అయ్యింది . ఇందులో 23.79 శాతం రాజస్థాన్ 'మహరాష్ట్ర 'గుజరాత్ కర్ణాటక' ఒడిషా' మధ్యప్రదేశ్ తెలంగాణలో ఎక్కువగా వుంది.

రోడ్లు' భవనాలు నిర్మాణం 'గనుల తవ్వకం వల్ల వ్యవసాయం చెట్ల పెంపకానికి భూమి లభ్యత తగ్గిపోతుంది . ఎడారీకరణ మరింత పెరిగిందని ఐ'రా'స తమ నివేదికలో తెలిపింది.

ఆహార భద్రతకు ముప్పు ఎధారీకరణ జరగడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆహార సమస్య ఏర్పడి వ్యాధులతో మరణించే వారికంటే ఎక్కువ సంఖ్యలో కరువుతో మరణించే ప్రమాదం వుందని హెచ్చరించింది. కరువు వల్ల మృత్యు వాత పడిన.వారి సంఖ్య అధికంగా వుంది.

ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే 200 కోట్ల హెక్టార్ల భూమి సారాన్ని కోల్పోయింది .

ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే 360 కోట్ల హెక్టార్ల భూమి ఎడారీకరణ ప్రభావానికి గురైంది 3 వంతు భూమి ఎడారీకరణ ప్రమాదంలో వుంది.ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే 10 సం"ల లో మనుషులకు ఆహారం పంటలు పండించదానికి అదనంగా,30 కోట్ల హెక్టార్ల భూమి అవసరం పడుతుందని అంచనా.

భూ క్షయం వల్ల 2010 లో ప్రపంచ స్థూల ఉత్పత్తి 10 శాతం తగ్గిందని ఆర్థిక సర్వేలు తెలుపుతున్నాయి.

అంతరిక్ష పరిశోధనా సంస్థ అంచనా ప్రకారం 29.32 శాతం భూమి క్షయానికి గురైనట్లు గుర్తించింది. దేశములో 28 రాష్ట్రాలలో భూమి క్షీణత పెద్ద ఎత్తున కొనసాగుతుంది.ఎడారీకరణ పెరిగిపోతుందని ఐ'సి'ఎ'ఆర్ సంస్థ అద్యయనం ప్రకారం 2013 నాటికి ఎ 'పి 14.35 శాతం తెలంగాణ 31.4 శాతం 'కర్ణాటక 36.24 శాతం భూ భాగం ఎడారీకరణ ముప్పులో ఉన్నట్లు తెలిసింది. ఎ 'పి లోని అనంతరం తెలంగాణ లో నల్లగొండ జిల్లాలో అత్యధిక ఎడారీకరణ జరుగుతున్నట్లు అంచనాలు వున్నాయి.

ప్రకృతి విధ్వంసాన్ని అరికట్టాలి.

ప్రభుత్వాలు 'ప్రజలు ప్రకృతి విధ్వంసాన్ని అరికట్టాలి. మానవుడు తన స్వార్థం కోసం సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలి. సహజ వనరుల విధ్వంసాన్ని అరికట్టాలి .అనేక ప్రకృతివిపత్తులుసంభవిస్తున్నాయి.ఎడారీకరణపై అవగాహన ప్రపంచ దేశాల ప్రభుత్వాలు కరువు ఎడారీకరణ అంశాలపట్ల ప్రజలకు అవగాహన చైతన్యం కలిగించడానికి ఐ'రా'స 1994 జూన్ 17 వ తేదీ నుండి ఎడారీకరణ కరువు నివారణ దినోత్సవం నిర్వహిస్తుంది.

### సుస్థిరాభివృద్ధి

సుస్థిరాభివృది లక్ష్యంగా అన్ని దేశాలు భూక్షీణత తటస్తీకరణతో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఎడారీకరణ నివారణ సమగ్ర చర్యలు కేంద్ర 'రాష్ట్ర 'స్థానిక ప్రభుత్వాలు 'పౌర సమాజం సమిష్టిగా ఆరోగ్యకరమైన భూమిని నిర్మించాలి.

1)నిరుపయోగ భూములను తిరిగి శశ్య శ్యామలం చెయ్యాలి.

2)సౌర శక్తి పవన శక్తి అందించాలన్న శాస్త్రవేత్తల సూచనల ప్రాతిపదికన కార్యాచరణకు ప్రభుత్వాలు పూనుకోవాలి

3)భూమిని పునరుద్ధరణ వ్యూహాలను అమలుచేస్తే ఆర్థిక పరిస్థితిని మెరుగు పడుతుంది.నూతన ఉద్యోగ కల్పన జరిగి ఆహార భద్రత పెరుగుతుంది.

4))జీవ వైవిధ్యాన్ని పునరుద్ధరించడానికి దోహద పడుతుంది. వాతావరణ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి భవిష్యత్ తరాల వారికి భూమి నివాస యోగ్యం అవుతుంది.

5)అభివృధి చెందుతున్న దేశాలలో ఎడారీకరణ ముప్పు ఎక్కువ వుంది.

ఎడారీకరణ అరికట్టాలంటే వ్యవసాయాన్ని పరిరక్షించాలి. నీటి కాలుష్యము వాయుకాలుస్యాన్ని అరికట్టాలి. 6)ప్రకృతి సహజ సంపదను రక్షించాలి. అడవులను నిర్మూలన అరికట్టాలి .రసాయన క్షిపణులు వాడకం తగ్గించాలి .యుద్ధాలు జరుగకుండా జాగ్రత్త పడాలి.

7)శరీరాన్ని ఆరోగ్యాన్ని రక్షించు కున్నట్లేఆహారాన్ని అందించే ప్రకృతి ప్రసాధిత భూమిని రక్షించుకోవాలి.

ప్రపంచ దేశాలు రాబోయే దశాబ్దంలో బిలియన్ హెక్టార్ల. భూమిని పునరుద్ధరించాలని ఐ'రా'స పిలుపు నిచ్చింది. సుమారు చైనా దేశ విస్తీర్ణం సమానంగా భూమి పునరుద్దరిస్తే మానవాళికి పుడుమికి ప్రయోజనం కలుగుతుంది.

8) సమర్థవంతమైన భూమి నిర్వహణ పద్ధతులు పాటించాలి. సేంద్రియ.వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. పంట మార్పిడి విధానం అమలు చెయ్యాలి.వర్షపు నీటి సంరక్షణ ' ఇసుక కంచెలు ' షెల్టర్ బెల్టులు వుడ్ లాట్స్ విండ్ బ్రేక్స్ .ఉపయోగించి మట్టిని బట్టేస్ చేయడం జరగాలి.

9)ఎడారులను సంపద సృష్టి కేంద్రాలుగా తీర్చిదిద్దాలి. ఎడారి ప్రాంతాలలో నివసించే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి.ప్రభుత్వం ఉచిత విద్య' వైద్యం 'రవాణ 'ఉపాధి కల్పనకు పెద్ద పీట వేయాలి.

10) పథకాల అమలు భూవనరుల అభివృద్ధి సమీకృత బంజరు భూముల అభివృధి పథకం ' ఎడారి అభివృధి కార్యక్రమం

అమలు అవుతున్న ప్రధాన మంత్రి కృషి సంచాయ్ యోజన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం భూవనరుల అభివృధి దోహద పడుతున్నాయి.

11) కొత్త అడవులను సృష్టించాలి. మైనింగ్ పేరుతో ప్రకృతిని దోచుకోవడం అరికట్టాలి. సామాజిక వనాలను పెంచాలి.

12)ప్రతి గ్రామం లో వృక్ష సంపద పెరగటానికి కృషి చెయ్యాలి.

రసాయన క్షిపణులను తగ్గించాలి.

13)ధరిత్రీ రక్షణ కోసం ప్రతి పౌరుడు కృషి చెయ్యాలి. "మన భూమిని మనమే రక్షించుకుందాం".ఆన్న ప్రతిజ్ఞ తోప్రతి పౌరుడు ముందుకు వెళ్లాలి భూరక్షణే జనరక్షణ నినాదం కాకుండా ప్రభుత్వాల విధానం కావాలని ఆశిద్దాం.

14,)భవిష్యత్ తరాలకు భూసారాన్ని కానుకగా ఇద్దాం అని ప్రతిజ్ఞ చెయ్యాలి.

ఎడారీకరణ కరువు నివారణ వ్యవస్థలను నిర్మించేందుకు కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ముందడుగు వేయాలి. సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనకు పర్యావరణ హిత చర్యలు చేపట్టి భూ క్షీణతకు అడ్డుకట్ట వేయాలి.

సేంద్రియ బాటపడుదాం భూసారాన్ని పెంచుదాం ప్రకృతితో చేతులు కలిపి ప్రగతి వైపు సాగుదాం మట్టిని రక్షిస్తే ఆ మట్టి మనల్ని పోషిస్తుంది. పుడమికి పునర్జీవనమే మానవ జాతికి శ్రీరామ రక్ష.